సంపుటి : 18
సంచిక : 108
Vol : 18
Issue : 108

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, ఆదివారం 21 జూన్ 2026
Warangal, Sunday 21 June 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ &
ఏపీలోని వివిధ జిల్లాల్లో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859



## ఓటును కాపాడుకోండి..



» నిర్లక్ష్యం చేస్తే ఓటు గల్లంతే » ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగేదిదే...

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రియ కీలకంగా మారుతోంది. రాజకీయ పార్టీలు ఈ ప్రక్రియ పైన ప్రత్యేకంగా ఫోకస్ చేసాయి. అటు ఎన్నికల సంఘం నియమించిన అధికారులు ఈ ప్రక్రియ నిర్వహణ పైన అవగాహన కల్పిస్తు న్నారు. ప్రతీ ఓటరుకు భరోసా ఇస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో చోటు చేసుకున్న పరిణామాలు.. జరిగిన ప్రచారంతో ఈ ప్రక్రియ పైన భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అలక్ష్యం చేస్తే ఓట్లు గల్లంతు అవుతాయనే హెచ్చరికలు పార్టీలు చేస్తున్నాయి. ఈ సమయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ పైన అధికారులు కీలక అంశాలను వెల్లడిస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో జూన్ 25 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్ రెడ్డి తెలిపారు. జూన్ 15 నుంచి జూన్ 24 వరకు సన్నాహక ప్రక్రియ జరుగుతుం దని.. జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫాం అందజేసే ప్రక్రియ కొనసాగు తుందని చెప్పారు. మిస్‌అయిన వారికి ఫాం 6తో మరోమారు ఎన్యూమరేట్ ఫాం అందజేసే అవకాశం ఉందన్నారు. జులై 31న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితా విడుదల చేస్తామని, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల (మిగతా 7లో...)



## 16 రకాల మందులపై నిషేధం

పీపుల్స్‌డైరీ–న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా వైద్య రంగాన సరికొత్త సంచలనం రేపుతూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఔషధాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదనే ఉద్దేశంతో.. దేశంలో విస్తృతంగా వాడుకలో ఉన్న 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ) మందులపై తక్షణమే అమల్లోకి వచ్చేలా దేశవ్యాప్త నిషేధం విధించింది. ఈ మందుల వాడకం వల్ల ఎలాంటి అదనపు వైద్య ప్రయోజనాలు లేవని, పైగా వీటివల్ల రోగులకు రిస్క్ పెరిగే అవకాశం ఉందని శాస్త్రీయ సమీక్షలో తేలడంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ సంచలన ఉత్తర్వులు జారీ చేసింది. డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్, 1940 లోని సెక్షన్ 26ఏ ప్రకారం ఈ నిర్ణయాన్ని అధికారికం చేస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు.

**అసలు ఈ కాంబినేషన్ మందులంటే ఏమిటి?**

రెండు లేదా అంతకంటే ఎక్కువ యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రేడియంట్స్ (ఔషధాల మిశ్రమం) ఒకే మోతాదులో (సింగిల్ టాబ్లెట్ లేదా సిరప్ రూపంలో) కలిపి తయారు చేసే వాటిని 'ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్' మందులు అంటారు. ఈ తరహా ఔషధాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు 'డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు' (మిగతా 2లో...)



## హైదరాబాద్‌లో కొత్త ఎలివేటెడ్ కారిడార్

» శిల్పా లేఅవుట్ నుండి నానల్‌నగర్ వరకు లింక్ రోడ్డు
» పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రయాణం ఇక మరింత ఈజీ
» ట్రాఫిక్ కష్టాలకు చెక్

2లో

## మోనాలిసాకు రక్షణ కల్పించండి



- కేరళ హైకోర్టు ఉత్తర్వులు
- కుంభమేళా వైరల్ గర్ల్‌కు ప్రాణహాని ఉందట

7లో



## భగీరథ్‌కు రిలీఫ్

**పోక్సో కేసులో బెయిల్ మంజూరు చేసిన కోర్టు**

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : గత కొన్ని రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన బండి భగీరథ్ పోక్సో కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు శనివారం కీలక తీర్పును వెలువరించింది. బండి భగీరథ్ తరఫు న్యాయవాదులు దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. అతనికి షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నెల రోజులకు పైగా జైల్లో ఉన్న బండి భరీరథ్ జైలు నుంచి విడుదల అయ్యారు. ఈ కేసు వివరాల్లోకి వెళితే.. మే 2026 మొదటి వారంలో హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై ఒక కేసు నమోదైంది. ఒక 17 ఏళ్ల మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు (మిగతా 7లో...)



ఉషోదయం
ఇంకా కన్నులు తెరవకముందే, గుండ్ల సింగారం
గుండెను 'ఉదయం' గాయపరిచింది.... పిట్టల కిలకిలారావాల
స్థానంలో జేసీబీల గర్జనలు వినిపించాయి.... ఐదేళ్లుగా చెమటతో కట్టుకున్న
గుడిసెలు, ఆశలతో నింపుకున్న చిన్న లోకాలు ఒక్క క్షణంలో నేలమట్టమైపోయాయి.
కలలు కూలిన శబ్దం ఆకాశాన్నే కదిలించింది. మండుటెండలో
పిల్లల నవ్వులు ఎండిపోయాయి... తల్లుల కళ్లలో ఆశలు
ఆవిరయ్యాయి... అయినా ఆ నేలపై వారి ప్రేమ తగ్గలేదు-
"మమ్మల్ని చంపినా ఇక్కడి నుంచి కదలము" అనే మాటే
వారి గీతంగా మారగా, చివరకు యంత్రాంగం
ఉక్కుపాదం ముందు ఓడిపోక తప్పలేదు...
కలల గూడు చెదరడంతో నిశ్చేష్టులై
మిగిలిపోయారు...

పీపుల్స్‌డైరీ–హనుమకొండ

2వ పేజీలో..

## కలలను కూల్చేశారు

- మట్టిలో కలిసిన గూడు కింద దాచుకున్న జ్ఞాపకాలు
- గుండ్ల సింగారంలో పేదల గుడిసెలు కూల్చివేత
- రోడ్డున పడ్డ 350 కుటుంబాలు
- ఐదేండ్లుగా అక్కడే నివాసం ఉంటున్న పేదలు
- గుండ్ల సింగారం గుండె చప్పుడు వినని యంత్రాంగం
- అడ్డుకోబోయిన సిపిఐ నాయకులు, పేదల అరెస్టు

## టెంక పురుగుకు చెక్

- శామీర్‌పేటలో ఇరేడియేషన్ కేంద్రం!
- మామిడి రైతులకు తెలంగాణ ప్రభుత్వం అండ
- ఆ పురుగుతో తీవ్రంగా నష్టపోతున్న మామిడి రైతులు

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : మామిడి సాగు చేసే రైతులకు వాతావరణ మార్పులు, అకాల వర్షాలు ప్రతీ ఏటా తీవ్ర నష్టాలను మిగులుస్తున్నాయి. ముఖ్యంగా మామిడి పండ్ల టెంకలో చేరే ప్రమాదకరమైన పురుగులు పండ్లను వేగంగా కుళ్లిపోయేలా చేస్తూ నాణ్యతను దెబ్బతీస్తున్నాయి. ఈ సమస్య కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మన మామిడి ఎగుమతులకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ నేపథ్యంలో మామిడి రైతులకు ప్రయోజనం చేకూరుస్తూ టెంకలోని పురుగులను పూర్తిగా నాశనం చేసే సరికొత్త సాంకేతిక ప్రక్రియను తెలంగాణలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం (మిగతా 2లో...)



# కలలను కూల్చేశారు...

- మట్టిలో కలిసిన గూడు కింద దాచుకున్న జ్ఞాపకాలు
- గుండ్ల సింగారంలో పేదల గుడిసెలు కూల్చివేత
- రోడ్డున పడ్డ 350 కుటుంబాలు
- ఐదేండ్లుగా అక్కడే నివాసం ఉంటున్న పేదలు
- గుండ్ల సింగారం గుండె చప్పుడు వినని యంత్రాంగం
- అడ్డుకోబోయిన సిపిఐ నాయకులు, పేదల అరెస్టు

**పీపుల్స్‌డైరీ–హనుమకొండ :** హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం ఉదయం పోలీసులు, అధికారులు వందలాది మంది నివాసం పేదల గుడిసెలను కూల్చి వేశారు. దీంతో గుండ్ల సింగారంలో రోజంతా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం ఉదయం 5 గంటలకు హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది సుమారు 200 మంది పోలీసుల బందోబస్తుతో హనుమకొండ గుండ్ల సింగారంలోని గుడిసెల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. దీంతో సిపిఐ నాయకులు, గుడిసె వాసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా తమకు కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని అడ్డుకుంటే లీగల్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించారని గుడిసె వాసులు వాపోయారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన పోలీసులు,ెంవెన్యూ సిబ్బంది ఐదు జేసీబీలతో సుమారు 350 గుడిసెలను నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా అడ్డుకోబోయిన సిపిఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. కాగా గత ఐదు సంవత్సరాలుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పరచుకొని ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి జీవిస్తున్నామని తమను ఇప్పటికిప్పుడు బయటికి పొమ్మంటే ఎక్కడికి పోవాలని గుడిసె వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉదయం 5 గంటలకు ఇండ్ల కూల్చివేతను అడ్డుకున్న సిపిఐ నాయకులను, కార్యకర్తలను నిర్బంధించి అరెస్ట్ చేసి కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అరెస్ట్ అయినవారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, నాయకులు పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మాలోత్ మంగ, బాలాజీ రంజిత్ లతో పాటు 40 మంది ఉన్నారు.







**మమ్మల్ని చంపినా ఇక్కడి నుంచి కదిలేదు లేదు: రమ**

'ఐదేళ్లుగా గుడిసెలు వేసుకొని ఉంటున్నాం. పిల్లలు ఇక్కడి నుంచే బడికి వెళ్తున్నారు. నిన్న అధికారులు ఇక్కడికి వచ్చినప్పటికీ.. ఎలాంటి ఇన్ఫర్మేషన్ ఇవ్వలేదు. ఈరోజు ఉ.4 గం.కే ఇక్కడికి వచ్చారు. పిల్లలు ఉన్నారని చెప్పినా వినిపించుకోలేదు. మహిళలం అని చూడకుండా నెట్టేశారు. ఇంట్లో ఉండగానే రేకులు కూలగొట్టారు. మమ్మల్ని ఇక్కడే చంపండి.. కదిలేదు లేదు' అని గుండ్ల సింగారానికి చెందిన రమ ఆవేదన వ్యక్తం చేశారు.

**గుడిసెలు కూల్చినా మండుటెండలోనే గుడిసె వాసులు**

గుండ్ల సింగారం లిక్కర్ ప్లాంట్ సమీపంలో గుడిసెలు తొలగించిన ప్రాంతంలో పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నివాసాలు కోల్పోయిన కుటుంబాలు ఎండలోనే తాత్కాలికంగా ఉంటూ అక్కడే వంటలు చేసుకుంటున్నాయి. చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ నివాసం కల్పించాలని బాధితులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ గుడిసెలను కూల్చి వేసినా తాము ఆ భూమి వదలబోమని స్పష్టం చేశారు.

# హనుమకొండలో పేదల ఇళ్ళు కూల్చివేత దుర్మార్గం

- గుండ్ల సింగారం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం
- ఇండ్ల పట్టాల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు
- నేడు హైదరాబాద్ లో ఇండ్ల స్థలాల సాధనకై అఖిలపక్ష సమావేశం
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**హనుమకొండ :** హనుమకొండ గుండ్ల సింగారంలో శనివారం పేదల ఇళ్ళు కూల్చి వేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గుండ్ల సింగారంలో పేదల ఇళ్ళు కూల్చివేత విషయం తెలుసుకున్న కూనంనేని సాంబశివరావు హుటా హుటిన హైదరాబాద్ నుండి విచ్చేసి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు,జిల్లా సిపిఐ నాయకులతో కలిసి గుండ్ల సింగారంలో సందర్శించారు. ఈ సందర్భంగా గుడిసె వాసులు సిపిఐ నాయకులకు తమ గోడు వెళ్లబోసుకుని, చిన్న పిల్లలు, మహిళలు అని చూడకుండా తమను తమ ఇండ్ల నుండి ఈడ్చి పడేశారని తెలిపారు. అలాగే బియ్యం, ఇతర నిత్యావసరాలను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.కాగా విద్యార్థుల సర్టిఫికేట్ లను సైతం తీసుకోనివ్వకుండా పోలీసులు ఈడ్చుకొని వెళ్లారని విద్యార్థులు తెలిపారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ హనుమకొండ గుండ్ల సింగారంలో ఇండ్లు కోల్పోయిన పేదలకు న్యాయం జరిగే వరకూ తాము అండగా ఉంటామని అన్నారు. భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా స్పందించని అధికారిక యంత్రాంగం నిలువ నీడ లేని పేదలు 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిపై అర్ధరాత్రివేళ దొంగల మాదిరిగా దాడి చేయడం దుర్మమార్గమైన చర్య అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న పేదల పై ప్రతాపం చూపుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించి ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయాలని, నిలుపుదల చేయని ఎడల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయకుంటే హనుమకొండ, వరంగల్ జిల్లాల నుండే రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఇళ్ళ స్థలాల పోరాటం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తాము ప్రభుత్వానికి మిత్ర పక్షంగా ఉన్నప్పటికీ పేదల కోసం ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతామని హెచ్చరించారు.వామపక్షాల ఆధ్వర్యంలో పేదల ఇళ్ళు, ఇండ్ల స్థలాలు, భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిపై ఆదివారం హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మక్దూం భవన్ లో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలపై ఒక భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సందర్భంగా గుండ్ల సింగారంలో ఇండ్ల కూల్చివేతకు గురైన బాధితులతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేదలందరూ ఐక్యంగా నిలబడాలని, సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. ఇండ్ల పట్టాలు సాధించే వరకూ విశ్రమించేదిలేదని చెప్పారు.సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జైలుకు అయినా వెళతాము కాని భూమిని వదిలేది లేదన్నారు.భూమి సాధించుకనే వరకు సిపిఐ మీ వెంటనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మేకల రవి, మంద సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, సిపిఐ జిల్లా నాయకులు కర్రె లక్ష్మణ్, బాషబోయిన సంతోష్, జక్కు రాజు గౌడ్, ఏషబోయిన శ్రీనివాస్, కొట్టేపాక రవి, రాజు కుమార్, అలువాల రాజు, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, నాయకులు పోనుగోటి రాము, గోపాల్ చారి, పూజారి అమృతయ్య, కట్కూరి కృష్ణ, మాలోత్ మంగ, కొడెపాక బాబు, మామునూరి దామోదర్, గుడికందుల శివ, పూజారి నరేందర్, కేతపాక ప్రసాద్, తాటికొండ ప్రశాంత్, బైసా మౌనిక, నలువాల సంధ్య, తాటికంటి మమత, గుంటి రజిత, గిన్నారపు రోహిత్, గుగులోత్ సురేష్, వందలాది ఇండ్ల వాసులు తదితరులు పాల్గొన్నారు.







# హైదరాబాద్‌లో కొత్త ఎలివేటెడ్ కారిడార్

- శిల్పా లేఅవుట్ నుండి నానల్‌నగర్ వరకు లింక్ రోడ్డు
- పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రయాణం ఇక మరింత ఈజీ
- ట్రాఫిక్ కష్టాలకు చెక్

**పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ :** హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు రూ.1656 కోట్లతో బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు ప్రతిపాదించిన ప్రతిష్టాత్మక ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు ప్రభుత్వం కొత్తగా మరో రోడ్డును అనుసంధానం చేయనుంది. మెహిదీపట్నంలోని నానల్‌నగర్ జంక్షన్ నుంచి ఫిలింనగర్ రోడ్డు నంబర్ 82 వరకు రక్షణ శాఖ భూముల అంచు మీదుగా కిలోమీటర్ పొడవైన నూతన రహదారిని హెచ్‌ఎండీఏ డిజైన్ చేస్తోంది. దీనివల్ల ఔటర్ రింగ్ రోడ్డు, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేల మధ్య ప్రయాణం మరింత సులభతరం కానుంది.

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న రోజువారీ ట్రాఫిక్ చిక్కులకు శాశ్వత చెక్ పెట్టడంతో పాటు నగరం నడిబొడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డు, శంషాబాద్ విమానాశ్రయానికి వేగంగా చేరుకునేందుకు హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ కీలక చర్యలు చేపట్టింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లో ఉన్న పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఫిలింనగర్, టీహబ్ మీదుగా గచ్చిబౌలి శిల్పా లేఅవుట్ వరకు నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్‌కు అదనంగా మరో సరికొత్త రోడ్డును అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ ప్రతిష్టాత్మక ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టును దాదాపు రూ.1,656 కోట్ల భారీ వ్యయంతో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ కారిడార్ ప్రయాణం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 నుంచి ప్రారంభమై ఫిలింనగర్, జడ్జీస్ కాలనీ, దుర్గంచెరువు, టీహబ్, శిల్పా లేఅవుట్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్డుకు కనెక్ట్ చేయనున్నారు. దాదాపు 9 కిలోమీటర్ల మేర సుదీర్ఘంగా సాగే ఈ భారీ ఎలివేటెడ్ కారిడార్ ద్వారా నగరంలోకి వచ్చేవారు, వెళ్లేవారు ట్రాఫిక్ సిగ్నల్స్ లేకుండా నేరుగా ప్రయాణించవచ్చు. ఈ రహదారిపై వాహనాల రాకపోకల సౌకర్యార్థం రోడ్డు నెం.82 , నార్నె రోడ్డు, రోడ్డు నెం.52, ఐటీసీ కోహినూర్ రోడ్డు, టీహబ్ జంక్షన్, ఔరో రియాల్టీ జంక్షన్ల వద్ద అత్యాధునిక ఎంట్రీ, ఎగ్జిట్ ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.



# 16 రకాల మందులపై నిషేధం..

(మొదటి పేజీ తరువాయి)

ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మార్కెట్లో ఉన్న మందులను క్షుణ్ణంగా పరిశీలించి.. ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు, వైద్యపరమైన సమర్థన లేని, హానికరమైన 16 కాంబినేషన్లను గుర్తించి బ్లాక్ లిస్టులో పెట్టింది.

**నిషేధిత జాబితాలో ఉన్న ప్రముఖ మందులు ఇవే..**

కేంద్ర ప్రభుత్వం నిషేధించిన ఈ 16 రకాల ఔషధాల జాబితాలో మనం నిత్యం వాడే పలు యాంటీబయాటిక్స్, నొప్పుల నివారణ మందులు (పెయిన్ కిల్లర్స్), గ్యాస్ట్రిక్, స్కిన్ కేర్ ప్రొడక్ట్స్ ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి..

యాంటీబయాటిక్స్: అమోక్సిసిలిన్ విత్ సెర్రాటియోపెప్టిడేస్; అమోక్సిసిలిన్, సెర్రాటియోపెప్టిడేస్, లాక్టోబాసిల్లస్ స్పోరోజెనస్; సెఫురోక్సిమ్ విత్ సెర్రాటియోపెప్టిడేస్ వంటి అత్యధికంగా వాడే యాంటీబయాటిక్ కాంబినేషన్లు. పెయిన్ కిల్లర్స్ ఉ ఇతర అలవెన్సులు: ఎసిటైల్ సాలిసిలిక్ యాసిడ్‌తో ఇథోహెప్టాజైన్ మిశ్రమం; డైసైక్లోమైన్, పారాసిటమాల్, క్లిడినియం బ్రోమైడ్ కాంబినేషన్లు. చర్మ సౌందర్య లోషన్లు/క్రీములు: కలబంద (అలోవెరా లేదా అలో ఎక్స్‌ట్రాక్ట్)తో విటమిన్–ఇ, జోజోబా ఆయిల్, ఆరెంజ్ ఆయిల్, వీట్ జెర్మ్ ఆయిల్, టీ ట్రీ ఆయిల్ వంటివి కలిపి తయారుచేసే పలు డెర్మటోలాజికల్ లోషన్లపై కూడా కేంద్రం నిషేధం విధించింది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!**

మార్కెట్‌లో అందుబాటులో ఉండే మందులు శాస్త్రీయ ఆధారాలతో, ప్రజలకు సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్రం స్పష్టం చేసింది. ఈ 16 రకాల మందుల తయారీ, అమ్మకాలు, పంపిణీ మరియు సరఫరాను తక్షణమే నిలిపివేయాలని ఫార్మా కంపెనీలు, ఇంపోర్టర్లు, డిస్ట్రిబ్యూటర్లను ఆదేశించింది. రాష్ట్రాల స్థాయిలోని డ్రగ్ కంట్రోల్ సంస్థలు మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు అలర్ట్ అయి, ఈ నిషేధ ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని కేంద్ర ఆరోగ్య శాఖ కఠిన ఆదేశాలు జారీ చేసింది.



# టెంక పురుగుకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక, సాంకేతిక సహకారంతో రాష్ట్ర ఉద్యానశాఖ అధికారులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని శామీర్‌పేటలో రూ.24 కోట్ల భారీ బడ్జెట్‌తో ఒక అత్యాధునిక ఇరేడియేషన్ కేంద్రాన్ని నిర్మించనున్నారు.

తెలంగాణలో ప్రతి సీజన్‌లో సగటున 3 లక్షల టన్నుల మామిడి పండ్లు ఉత్పత్తి అవుతుండగా.. అందులో దాదాపు 20 శాతానికి పైగా పండ్లకు టెంక పురుగు పడుతోందని అధికారిక అంచనాలు చెబుతున్నాయి. దీనివల్ల ఆశించిన ధర లభించక రైతులు తాము పండించిన పంటలో సగానికి పైగా పండ్లను పారేయాల్సి వస్తోంది. మిగిలిన పండ్లు కూడా రవాణా దశలోనే వేగంగా కుళ్లిపోతుండటంతో రైతులు కోట్లలో నష్టపోతున్నారు. ఈ ఏడాది జపాన్ మన దేశం నుంచి వెళ్లే మామిడి పండ్ల ఎగుమతులపై నిషేధం విధించిన నేపథ్యంలో.. తెలంగాణ రైతాంగాన్ని ఆదుకోవడానికి ఈ ఇరేడియేషన్ ప్రాజెక్టును రాబోయే 12 నెలల గడువులోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

మామిడి చెట్లకు పిందెలు కాసి నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడే "ఫ్రూట్‌ఫ్లై" అనే సూక్ష్మజీవి వాటి తొక్క ద్వారా లోపలికి ప్రవేశిస్తుందని ఉద్యానవనశాఖ అధికారులు చెబుతున్నారు. కాయ పరిమాణం పెరుగుతున్న కొద్దీ అది టెంక లోపలికి చేరి స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. కాయ పూర్తిగా పక్వానికి వచ్చి పండుగా మారే సమయంలో ఈ సూక్ష్మజీవి పెద్ద పురుగుగా మారి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా వేసవిలో అకాల వర్షాలు కురిస్తే ఈ పురుగులు టెంక నుంచి బయటకు వస్తాయి. ఫలితంగా పండును కోసినప్పుడు టెంక చివరన పురుగు కనిపిస్తుంది. రాష్ట్రంలో ఎక్కువగా పండించే బేనిషాన్ రకంలో ఈ సమస్య అత్యధికంగా ఉండగా.. ఆ తర్వాత హిమాయత్, మల్లిక వంటి రకాల్లోనూ ఇది ఎక్కువగా కనిపిస్తోంది.

ఈ సమస్యకు పరిష్కారంగా తీసుకొస్తున్న రేడియేషన్ ప్రక్రియలో మామిడిపండ్లను తొలుత ఒక ప్రత్యేక క్వారంటైన్ తరహా గదిలోకి తరలిస్తారు. అక్కడ అంతర్జాతీయ ప్రమాణాల నడుమ సాంకేతిక నిపుణులు పండ్లపైకి శక్తిమంతమైన గామా కిరణాలను ప్రసరింపజేస్తారు. ఈ కిరణాలు పండు లోపలికి చొచ్చుకుపోయి, పండు నాణ్యతను గానీ, రుచిని గానీ మార్చకుండా టెంక లోపల దాగున్న పురుగులను, వాటి గుడ్లను పూర్తిగా నిర్మూలిస్తాయి. దీనివల్ల పండ్లు ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉండే కాలం కూడా పెరుగుతుంది.

నిజానికి ఈ ఇరేడియేషన్ కేంద్రం స్థాపన అత్యంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో గత పదేళ్ల నుంచి ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టీకల్చర్ పథకం కింద ఈ కేంద్రానికి నిధులు మంజూరయ్యాయి. శామీర్‌పేటలో పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. దీనికి అదనంగా రంగారెడ్డి జిల్లా కోహెడలోని అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌లోనూ మరొక ఇరేడియేషన్ కేంద్రాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ముంబయి, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో మాత్రమే ఉన్న ఈ సౌకర్యం త్వరలోనే తెలంగాణలో అందుబాటులోకి రానుండటం ఇక్కడి మామిడి సాగుదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.





# సింగరేణి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి-కవిత డిమాండ్

- తీర్మానాలు పరిష్కరించాల్సిందే: కవిత డిమాండ్..
- అమలు చేయకుంటే నేల రోజుల్లో ఆమరణ నిరాహార దీక్ష చేస్తా..
- భూపాలపల్లి ఇద్దరు గండ్ర ల మధ్యలో నలుగుతోంది..
- భూపాలపల్లి జిల్లా పర్యటన లో కల్వకుంట్ల కవిత



**భూపాలపల్లి జిల్లా. జూన్ 20(పీపుల్స్ డైరీ ) :** సింగరేణి సంస్థ గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం అవగాహన లేకపోవటం సిగ్గుచేటని తెలంగాణ టి ఆర్ ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కార్మికుల మీద ప్రేమతో సంస్థను కాపాడుకుంటూ ముందుకు తీసుకెళ్లాలన్న సోయి ప్రభుత్వానికి లేదన్నారు. పార్టీలు ఏవైనా సరే అందులో ఉండే ట్రేడ్ యూనియన్లు మాత్రం కార్మికుల కోసమే మాట్లాడాలని కవిత హితవుపలికారు.

**ఆ ఐదు తీర్మానాలు పరిష్కరించాల్సిందే: కవిత డిమాండ్..**

సింగరేణి సంస్థ గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం అవగాహన లేకపోవటం సిగ్గుచేటని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కార్మికుల మీద ప్రేమతో సంస్థను కాపాడుకుంటూ ముందుకు తీసుకెళ్లాలన్న సోయి ప్రభుత్వానికి లేదన్నారు. పార్టీలు ఏవైనా సరే అందులో ఉండే ట్రేడ్ యూనియన్లు మాత్రం కార్మికుల కోసమే మాట్లాడాలని కవిత హితవుపలికారు. జెండాలన్నీ పక్కన పెట్టి కార్మికుడికి మంచి చేయటమే అజెండా కావాలని పిలుపునిచ్చారు.భూపాలపల్లి 5 ఇంక్లైన్ రోడ్డు బస్టాండ్ వద్దా ౹=నా జెండాను ఆవిష్కరణ చేసారు. సందర్భంగా కవిత మాట్లాడారు..ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ..'సింగరేణిపై రేవంత్ సర్కార్‌కు అవగాహన లేదు. నైనీ బ్లాక్‌కు సంబంధించి మన కార్మికులు చేసిన ఆందోళనతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఆ బాధ, ఆక్రోశంతోనే సింగరేణిలో 13 వేల మంది కార్మికులు ఎక్కువగా ఉన్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ప్రధాని మోదీ లేబర్ కోడ్ పేరుతో నాలుగు నల్ల చట్టాలు తెస్తే.. ఆ చట్టాలను తమ రాష్ట్రంలో అమలు చేసేది లేదని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తేల్చి చెప్పారు. అలాంటి నిర్ణయం తీసుకున్న ఆమెకు మనం సెల్యూట్ చేయాల్సిందే. కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయటం లేదు.కానీ మన రాష్ట్రం మాత్రం ఈ చట్టాలను అమలు చేయమని చెప్పే విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారు. ఇవాళ్టి రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధానంగా ఐదు తీర్మానాలు చేసుకున్నాం. ఈ సమావేశంలో చర్చించి చేసిన తీర్మానాలను లేఖ రూపంలో ప్రభుత్వానికి సమర్పిస్తాం. తెలంగాణకు సింగరేణి ప్రాణపదం. కచ్చితంగా సంస్థను కాపాడుకుంటాం. 70 ఏళ్ల వయసులో మా హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌పై రౌడీ షీట్ పెట్టారు. ఆయన పెద్ద రౌడీ అని ప్రభుత్వం అనుకుంటే మేము చిన్న రౌడీలం. మాతోపాటు ధర్మసమాజ్ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కూడా జత చేరాయి. మా రౌడీల గుంపును తట్టుకోవటం ప్రభుత్వం వల్ల కాదు. ఈ కార్యక్రమాన్ని ఏదో రాజకీయ కార్యక్రమం లాగా కాదు.. సింగరేణి సంస్థను కాపాడుకోవాలనే ఉద్దేశంతో పెట్టాం. మరో 20 రోజుల్లో కొత్త రాజకీయ శక్తిగా వస్తున్నాం. ఐదు తీర్మానాలు..కేంద్రం తెచ్చిన నాలుగు నల్ల చట్టాలను అమలు చేసేది లేదని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయాలి. అసెంబ్లీలో తీర్మానం చేయాలి.మెడికల్ బోర్డును మానవతా దృక్పథంతో ఆలోచించి వెంటనే ఏర్పాటు చేయాలి. పెండింగ్ కేసులు పరిష్కరించాలి.అలియాస్ పేర్ల సమస్యను పరిష్కరించాలి. వీటికి లీగాలిటీ వర్తించదు. పొలిటికల్ విల్ ఉంటే సమస్య పరిష్కరించవచ్చు.సింగరేణి సంస్థ ఆల్ట్ మిన్ కంపెనీతో రూ.2,250 కోట్లతో చేసుకున్న ఒప్పందంపై శ్వేతపత్రం విడుదల చేయాలి.నైనీ, తాడిచర్ల వంటి బొగ్గు గనులను కొత్తగా వచ్చే గనులనూ సింగరేణి సంస్థనే ఆపరేట్ చేయాలి.

# నెల రోజుల్లో డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలి..మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి

- లేకుంటే నిరాహార దీక్ష" ప్రభుత్వానికి కవిత అల్టిమేటం
- బాయి బాట కార్యక్రమంలో కవిత..



**జయశంకర్ భూపాలపల్లి జూన్ 20 పీపుల్స్ డైరీ..** డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చేందుకు మెడికల్ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నెల రోజులు గడువు ఇస్తున్నానని, లేదంటే ఇక్కడికే వచ్చి నిరాహార దీక్ష చేస్తానని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అల్టిమేటం జారీ చేశారు.జెండా పండుగలో భాగంగా భూపాలపల్లిలో పార్టీ జెండా ఆవిష్కరించిన కవిత మాట్లాడారు.కార్మికుల గోస చూసి కళ్లలో నీళ్లు గత ఐదు రోజులుగా కార్మికులతో మాట్లాడుతున్నాను. వాళ్లకు తాగేందుకు మంచి నీళ్లు కూడా ఇవ్వటం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో ఒక పెద్ద మనిషి కలిసి గోస చెప్పుకుంటే కళ్లలో నీళ్లు వచ్చాయని చెప్పారు. బొగ్గుబాయిల ప్రాంత ప్రజలు సింగరేణిలో కనీసం కార్మికుడిగా జాబ్ వస్తుందని ఆశిస్తారని అన్నారు. రిటైర్ అవుతున్న వాళ్ల పిల్లలకు డిపెండెంట్ ఉద్యోగాలు కావాలని భావిస్తారు. కానీ ప్రభుత్వం మెడికల్ బోర్డు పెట్టకుండా రిటైర్ అవుతున్న వాళ్లను ఆవేదనకు గురి చేస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ గ్యారంటీలపై విమర్శలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అని చెప్పి ఫ్రీ బస్ తప్ప ఒక్కటీ అమలు చేయలేదని కవిత మండిపడ్డారు. ఫ్రీ బస్ వల్ల మహిళలు గొడవ పడుతున్నారని, పురుషులకు సీట్లు లేకుండా పోయిందని అన్నారు. ఆటో డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారని, బస్సుల సంఖ్య పెంచటం లేదని చెప్పారు.వికలాంగులకు, 60 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లకు ఉచిత ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. షాదీ ముబారక్, తులం బంగారం, కేసీఆర్ కిట్ లాంటివి ఇవ్వటం లేదని విమర్శించారు.భూపాలపల్లి అభివృద్ధిపై ప్రశ్నలు భూపాలపల్లి జిల్లా కేంద్రం అయిన తర్వాత కూడా వసతులు రాలేదని కవిత అన్నారు. బ్రిడ్జిలు పాడయ్యాయని, అవుటర్ రింగ్ రోడ్డు అవసరమని తెలిపారు. రాజకీయ నాయకుల జాగాలు ఉంటే రోడ్డును వంకర తిప్పుతున్నారని ఆరోపించారు.గత ఎమ్మెల్యే భూకబ్జాలు చేశారని, చెరువులు, అడవులు వదలేదని ఆరోపించారు. 190 ఎకరాల అటవీ భూమి కబ్జాపై సుప్రీంకోర్టు తెలంగాణ ఇజ్జత్ తీసిందని చెప్పారు. ఇప్పుడున్న ఎమ్మెల్యే కూడా అవే పనులు చేస్తున్నారని విమర్శించారు.ఓపెన్ కాస్ట్ కోసం 140 ఎకరాలు ఇచ్చిన ప్రజలకు ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదని కవిత అన్నారు. భూములు ఇచ్చిన వారికి కచ్చితంగా పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎమ్మెల్యే సీటు గెలుస్తాం భూపాలపల్లిలో ఇవాళ మొదటి జెండా ఎగురవేశామని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే సీటు కూడా గెలుస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలను నమ్ముకొని పార్టీ పెట్టానని, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు.నిరంతరం కార్మికుల పక్షాన ఉంటానని కవిత స్పష్టం చేశారు.

# సింగరేణిలో రాజకీయ జోక్యంతోనే పరిష్కారం కాని సమస్యలు

- సింగరేణి కి చెల్లించవలసిన 56 వేల కోట్ల బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలి
- మెడికల్ బోర్డు పాత విధానంలో కొనసాగించాలి
- సొంత ఇంటి పథకంలో వెంటనే అమలు చేయాలి
- నూతన గనులను ఏర్పాటు చేయాలి
- సమస్యలు పరిష్కరించకుంటే అన్ని సంఘాలు కలుపుకొని సమ్మెకు సిద్ధం
- ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాజ్ కుమార్




**భూపాలపల్లి జూన్ 20 పీపుల్స్ డైరీ :** 2014 తర్వాత సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, దానికి బి ఆర్ ఎస్ గత ప్రభుత్వంలో కిటికీలు తెరిస్తే ఇప్పుడున్న ప్రభుత్వం తలుపులు తెరిచిందని, బిఆర్ఎస్ ఏలు పెడితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాలు పెట్టిన చందంగా ఉ ందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ ఎద్దేవా చేశారు.శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు నాయుడు రాజశేఖర్ రెడ్డి లాంటి ఎంతో ముఖ్యమంత్రులు సింగరేణి ఒక ప్రభుత్వ గుర్తింపు సంస్థగానే చూసేవారని ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా పరిపాలించారని కానీ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాటి నుండి 2014 తర్వాత సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని ఇప్పుడున్న డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క సింగరేణి యాత్ర చేపట్టి టిఆర్ఎస్ ప్రభుత్వం లో సింగరేణికి 26 వేల కోట్లు బకాయి ఉందని దీనివల్ల సింగరేణి నష్టల్లో ఉందని చెప్పిన ఆయన ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 56 వేల కోట్ల బకాయి పెండింగ్ లో ఉందని ప్రభుత్వం వెంటనే సింగరేణికి బకాయి చెల్లించాలని గుర్తు చేశారు.గుర్తింపు సంఘంగా గెలిచిన నుండి కార్మిక సమస్యల పరిష్కారం కోసం స్ట్రక్చర్ మీటింగ్లలో కార్మిక సమస్యలపై మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. అట్లాగే మారుపేరుల సమస్య, కార్మికుల సొంతింటి పథకం అమలుపై అనేకసార్లు ప్రభుత్వం యాజమాన్యంతో చర్చించడం జరిగిందని తెలిపారు. పెరిక్స్ పై ఇన్కమ్ టాక్స్ తగ్గించాలని, సింగరేణిలో నూతన బొగ్గు గనులను ఏర్పాటు చేయాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఇలాంటి అనేక కార్మిక సమస్యలపై వాటి పరిష్కారం కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని ఈనెల 26న ప్రభుత్వం చర్చలకు పిలిచిందని సమస్యలు పరిష్కరించకుంటే నెల రోజుల్లో అన్ని జాతీయ ట్రేడ్ యూనియన్ సంఘాలతో కలిపి పెద్ద ఎత్తున సమ్మె చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి ఎంఏ ఆసిఫ్ పాషా, కాంట్రాక్ట్ కార్మికుల ఇంచార్జ్ నూకల చంద్రమౌళి, భీమనాథుని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యం, ధ్యానంతో ఏకాగ్రత- ప్రిన్సిపల్ లలిత



**హుస్నాబాద్, టౌన్; (పీపుల్స్ డైరీ) జూన్ 20:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, హుస్నాబాద్‌లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో శనివారం ముందస్తు యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ వి. లలిత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తో పాటు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు కలిసి యోగా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపల్ వి. లలిత మాట్లాడుతూ యోగా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను అందిస్తుందని తెలిపారు. ధ్యానం ద్వారా ఏకాగ్రత పెరుగుతుందని, విద్యార్థినులు లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు.కళాశాల జూనియర్ అసిస్టెంట్, యోగా నిపుణురాలు కె. గీతాంజలి వివిధ యోగాసనాలు, ధ్యానం ప్రాముఖ్యతను వివరించారు. ఆమె ఆధ్వర్యంలో ప్రిన్సిపల్, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు యోగాసనాలు చేసి ధ్యానం నిర్వహించారు. విద్యార్థినులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.కరుణాకర్ పర్యవేక్షణలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి. రవీందర్, టి. నిర్మలదేవి, బి. లక్ష్మయ్య, ఎ. సంపత్, ఎస్. కవిత, కె. స్వరూప, జి. కవిత, ఆస్మా పిర్దోస్, ఓ. రాణి, లైబ్రేరియన్ బి. హిమబిందు, జూనియర్ అసిస్టెంట్లు కె. గీతాంజలి, ఎస్. రాములు, రికార్డ్ అసిస్టెంట్ టి. రమాదేవి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక అనారోగ్యంతో యువకుడు మృతి

**ఉసిరికాయల పల్లి గ్రామపంచాయతీ అలియా తండలో విషాదం**



**సింగరేణి (కారేపల్లి) జూన్ 20(పీపుల్స్ డైరీ):** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అలియా తండకు చెందిన వాంకుడోత్ నరేష్ (30) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు.చిన్న వయస్సు నుంచే మధుమేహ వ్యాధితో బాధపడుతున్న నరేష్ గత కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ చికిత్స పొందుతున్నారు. ఇటీవల మూత్రపిండాల సమస్యల కారణంగా డయాలసిస్ చేయించుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు.నరేష్ మరణ వార్తతో అలియా తండలో విషాద వాతావరణం నెలకొంది. బంధువులు, గ్రామ పెద్దలు, యువకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. యు-వకుడి అకాల మరణం గ్రామస్థులను కలచివేసింది.

# రైతన్నలకు కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి సాయం

**మేకల మల్లేష్ యాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడలు**



**సింగరేణి (కారేపల్లి) జూన్ 20(పీపుల్స్ డైరీ):** దేశ రైతాంగ సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు మేకల మల్లేష్ యాదవ్ అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా రైతుల ఖాతాల్లో నేరుగా ₹2,000 చొప్పున పెట్టుబడి సాయం జమ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిన్న, సన్నకారు రైతులకు సాగు ఖర్చుల భారం తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మూడు విడతల్లో మొత్తం ₹6,000 ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. రైతుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.రైతులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు. రైతు సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మేకల మల్లేష్ యాదవ్ స్పష్టం చేశారు.

# నూతన విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



**ఎల్కతుర్తి జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రం లోని వల్లభపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం శనివారం రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి పొనగంటి శ్వేత ఉప సర్పంచ్ అంబాల అనిల్ కుమార్ పాల్గొని నూతన విద్యార్థులకు పాఠ్య రాత పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీమతి పొనగంటి శ్వేత మాట్లాడుతూ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బృందం ఉండటంతో పాటు గత విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాలు మెరుగ్గా వచ్చాయని తెలిపారు. గ్రామంలోని బడి వయస్సు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరాలని సూచించారు. అలాగే పాఠశాలలో గ్రంథాలయం ప్రయోగశాల ఆటస్థలం వంటి సౌకర్యాలు ఉండటంతో పాటు ఉచిత విద్య మధ్యాహ్న భోజనం పాఠ్య పుస్తకాలు రాత పుస్తకాలు యూనిఫాంలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.ఉప సర్పంచ్ అంబాల అనిల్ కుమార్ మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి వెంకట సుహాసిని వెంకట స్వామి కల్యాణి రమాదేవి ప్రేమ్ ప్రసాద్ రావు అఖిల తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసిన సివిల్ సప్లై అధికారులు

**హాస్టల్ సిబ్బంది నాణ్యత ప్రామాణాలు పాటించాలి-సివిల్ సప్లై అధికారి షేక్ ఎప్రాన్**



**రేగొండ జూన్ 20 పీపుల్స్ డైరీ :** తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థుల సంక్షేమం, వసతి గృహాల్లో ఆహార నాణ్యత, మరియు మౌలిక వసతులను పర్యవేక్షించడానికి సివిల్ సప్లై అధికారులు, విద్యాశాఖ అధికారులతో కలిసి ఎంజేపీ (వీ+దీఎ) గురుకుల పాఠశాలలను జిల్లా పరిషత్ హై స్కూల్ ను తనిఖీ చేశారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు సివిల్ సప్లై ఇన్స్ పిక్టన్గ అధికారి షేక్ ఎప్రాన్ సిబ్బందితో రేగొండ మండలం ఎం జి బి వి గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాల, రేగొండ మండల కేంద్రంలోని రెండవ రేషన్ షాప్ ను తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు.వంటది, పరిసరాలు, కిచెన్ పరిశుభ్రత, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అనేది తనిఖీ చేసారు .మౌలిక వసతులు: హాస్టల్ గదులు, త్రాగునీటి సౌకర్యం (RO ప్లాంట్లు), మరియు మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు.రేగొండ మండల కేంద్రంలోని రెండవ రేషన్ మరియు పౌర సరఫరాల వివరాలను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో ఎస్సై జంగయ్య, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్ భాస్కర్ల రాజు, టెక్నీకల్ అసిస్టెంట్ రాహుల్, అరవింద్ పాల్గొన్నరు.

పీపుల్స్‌డైరీ

వరంగల్

ఆదివారం, 21 జూన్ 2026

సంపుటి : 18, సంచిక : 107



## సర్పంచ్ కుటుంబం పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) జూన్ 20 :** పొట్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్ తండ్రి కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఈరోజు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ వారి కుటుంబాన్ని పరామర్శించి బ్రతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు కర్ర రవీందర్ రెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో మరణించగా వారి భార్య పిల్లల్ని పరామర్శించారు మరో మహిళ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు వారి వెంట సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి అన్వర్ కౌన్సిలర్ గాదపాక రవి ప్రభాకర్ రెడ్డి గ్రామ నాయకులు శంకర్ శ్యాంసుందర్ గౌడ్ వెంకట స్వామి రాజేష్ నరసింహారెడ్డి కే మల్లయ్య అబ్గర్ పాల్గొన్నారు

## ఇసుక ట్రాక్టర్ల పై ఆకస్మిక తనిఖీ



**వీణవంక జూన్ 20( పీపుల్స్ డైరీ ) :** పోలీస్ స్టేషన్ పరిధిలో ఇసుక వ్యవసాయ ట్రాక్టర్లపై ప్రత్యేక తనిఖీలు (స్పెషల్ డ్రైవ్ ) నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా ట్రాక్టర్ల యొక్క వాహన పత్రాలను (డాకుమెంట్స్) క్షుణ్ణంగా పరిశీలించారు రేడియం/రిఫ్లెక్టివ్ సేఫ్టీ స్టిక్కర్లతో పాటు ఇతర భద్రతా ప్రమాణాలను తనిఖీ చేసారు. తనిఖీలలో ఎటువంటి భద్రతా స్టిక్కర్లు అవసరమైన పత్రాలు లేని (13) ఇసుక రవాణా ట్రాక్టర్లను గుర్తించారు. ఒక (01) ట్రాక్టర్ మైనర్ డ్రైవర్ నడుపుతుండగా పట్టుకున్నాము అని నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టప్రకారం జరిమానాలు విధించాము అని నిబంధనలు పాటించని వాహనాలకు పోలీసుల ఆధ్వర్యంలో సేఫ్టీ స్టిక్కర్లను అంటించాము అని వారు తెలిపారు.


## కారేపల్లి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ కు)జన్మదిన శుభాకాంక్షలు



**సింగరేణి (కారేపల్లి) జూన్ 20(పీపుల్స్ డైరీ):** కారేపల్లి గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ జన్మదిన సందర్భంగా శనివారం కేక్ కట్ చేసి ఘనంగా పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, గాదేపాడు గ్రామ సర్పంచ్ భూక్యా రంజిత్ కుమార్ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టేకులగూడెం గ్రామ సర్పంచ్ గుమ్మడి సందీప్, మోట్ల గూడెంగ్రామ సర్పంచ్ పొడుగు పెంటయ్య, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. వారు సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ జన్మదిన వేడుకలను ఆనంద భరితంగా జరుపుకున్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**బి ఆర్ ఎస్ వి మండల మాజీ అధ్యక్షులు వొల్లాల శ్రీకాంత్ గౌడ్**



**వీణవంక జూన్ 20( పీపుల్స్ డైరీ) :** ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రైవేట్ విద్యాసంస్థల లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని బిఆర్ఎస్వి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ప్రభుత్వ బడులను పూర్తిగా విస్మరిస్తూ విద్యావ్యవస్థను గాలికి వదిలేస్తూ విద్యాశాఖ మంత్రిని నియమించకుండా పేద మధ్యతరగతి ఉన్నత చదువులకు అడ్డగోలు గా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు ఆలోచనలు ఉన్నాయని పాఠశాలల్లో అధిక ఫీజులు తీసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని పీలుస్తూ ప్రవేటు విద్యాసంస్థల దోపిడీ ఓవైపు ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యా వ్యవస్థ పూర్తిగా గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా మత్తునీదురా వీడి విద్యా శాఖకు మంత్రిని నియమించి అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మొదలుగు సదుపాయాలు కల్పించి వీధిలో నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి రాష్ట్ర మాజీ కార్యదర్శి హరీష్ వర్మ అప్పని మండల నాయకులు రాకేష్ , అభిలాష్ తదితరులు పాల్గొన్నారు

# కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులపై కార్యకర్తలు, అప్రమత్తం గా ఉండాలి

- 'సర్ ' పై అప్రమత్తంగా ఉండాలి..మాజీ ఎమ్మెల్యే గండ్ర,బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు రేగుల రాకేష్ రెడ్డి,
- బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సర్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం..



**భూపాలపల్లి జూన్ 20 పీపుల్స్ డైరీ :** కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులపై కార్యకర్తలు, అప్రమత్తం గా ఉండాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'సర్' ఓటర్ సవరణ ప్రక్రియ పై అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొన్న భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఓటు అనేది దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుడికి రాజ్యాంగం, చట్టం కల్పించిన అత్యున్నత ఆయుధం. మన భవిష్యత్తును, దేశ పాలనను నిర్దేశించే నాయకులను ఎన్నుకునే స్వేచ్ఛను, బాధ్యతను ఓటు హక్కు మనకు ఇస్తుంది. మన ప్రాంత సమస్యలను, దేశ ప్రగతిని అర్థం చేసుకుని, సమర్థవంతంగా పాలించగల నాయకుడిని ఎన్నుకునే అవకాశం మనకే ఉంది. కాబట్టి భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా "సర్" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఓటరు జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడమే ధ్యేయంగా ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ ) నేరుగా ఓటర్ల ఇళ్లకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నారు. అర్హులైన కొత్త ఓటర్లను జాబితాలో చేర్చడం, మరణించిన వారి లేదా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారి పేర్లను తొలగించడం, అలాగే ఓటరు కార్డుల లోని తప్పులను సవరించడం ఈ ఇంటింటి సర్వే యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ సమయంలో ఓటర్లు తమ పేరును ధృవీకరించుకోవడానికి లేదా సవ రణల కోసం అధికారులకు ఆధార్ కార్డు, ఓటర్ ఐడీ, చిరునామా ఆధారాలను చూపించాల్సి ఉంటుంది. ఇది చాలా ముఖ్యమైన కార్యక్రమం కాబట్టి ఈ కార్యక్రమంలో ఎన్నికల సంఘం పార్టీ నుండి బూత్ కి ఒక్కరిని ప్రతినిధిగా నియమించడం జరిగింది. కాబట్టి బూత్ లెవల్ అధికారి చేసే ఈ ప్రక్రియలో పార్టీ శ్రేణులు భాగస్వా ములు అవుతూ అనర్హులైన ఓటర్లను తీసివేస్తూ, అర్హులైన వారికీ ఓటు హక్కు కల్పించేలా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. అనంతరం రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాత్మక అడుగులు, పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదుపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడం జరిగింది.

# ఊరి కోసం ఒక్కరోజు శ్రమదానంలో కాజీపేట ఏసిపి

- స్వచ్ఛ కమలాపూర్ అందరి లక్ష్యం కావాలి
- ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమం లో పాల్గొన్న కాజీపేట ఏసిపి.



**కమలాపూర్ జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** కమలాపూర్ మండలంలో గ్రామానికి సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో సర్పంచ్ పబ్బు సతీష్ ఆధ్వర్యంలో చేపట్టిన వారంలో ఊరి కోసం ఒకరోజు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుంది. సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి తన సిబ్బంది, కమలాపూర్ గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, సీఐ నవీన్, ఎస్ఐ దిలీప్, కమలాపూర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పనుగట్ల స్టార్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, యువత, గ్రామస్తులతో కలిసి వీధుల్లో చెత్తాచెదారాన్ని తొలగించి స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహిం చారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ వారానికి ఒకరోజు గ్రామం కోసం కేటాయిస్తే పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని ఏసీపీ ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. ACP పింగిలి ప్రశాంత్ రెడ్డి గ్రామ పరిశుభ్రత అనేది కేవలం గ్రామపంచాయతీ లేదా ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యత. కమలాపూర్ సర్పంచ్ సతీష్ చేపట్టిన వారంలో ఊరి కోసం ఒకరోజు కార్యక్రమం చాలా ఆదర్శవంతమైనది. ప్రజలు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో జరగాలి. సమాజ సేవలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందుంటుంది.

# యాప్‌తో సంబంధం లేకుండా యూరియా పంపిణీ చేయాలి

- భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే గండ్ర, రేగుల రాకేష్ రెడ్డి



**భూపాలపల్లి జూన్ 20 పీపుల్స్ డైరీ :** యాప్‌తో సంబంధం లేకుండా యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తు. భూపాలపల్లి జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్ వద్దా రోడ్డు పై బైటయించి బి ఆర్ ఎస్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి,బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు రేగుల రాకేష్ రెడ్డి,నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ. వర్షాకాల సీజన్ ప్రారంభం కాబోతున్న సమయంలో రైతులను ఏదో విధమైన ఇబ్బందులకు గురి చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని యాప్ ద్వారా యూరియా బస్తాలను అందించడం ఏమిటా అని యాప్ కు సంబంధం లేకుండా రైతులకు యూరియా బస్తాలు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించక ముందు కరువు కాటకాలతో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్రాన్ని పచ్చని పాడిపంటలతో కళకళలాడే విధంగా టిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే కరువు రాష్ట్రంగా తీర్చితోందని ఆవేదన చెందారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రైతులకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందని ఎద్దేవా చేశారు.. సన్న వడ్లు పండిస్తే 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకు కూడా బోనస్ ఇవ్వకపోవడం ఏమిటా అని ప్రశ్నించారు. రైతులకు సీజన్కు సరిపడా రైతుబంధు డబ్బులు విడుదల చేయకుండా సభలు సమావేశాలతో కాలయాపన గడుపుతున్నారు తప్ప ఖరీఫ్ సీజన్ మొదలైన కూడా రైతుబంధు ఇయ్యకపో వడమే మిటాని అన్నారు. వర్షాకాలం స్టార్ట్ అయ్యి 20 రోజులు అవుతున్న ఇప్పటివరకు వర్షాలు కురవకపో వడంతో రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారని కానీ వర్షపాతం కూడా తక్కువగా ఉండటంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని అదే కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీరు వచ్చేది ఉంటే రైతులు వర్షాకాలం కోసం ఆకాశం వైపు చూసే పరిస్థితి ఉండేది కాదన్నారు. యాప్ ద్వారా కాకుండా రైతులకు నేరుగా యూరియా బస్తాలు అందే వరకు రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని రైతులు ఇబ్బంది పడకుండా ఉండాలని రైతు పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ పోరాడుతుందని హామీ ఇచ్చారు..

# పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**నీట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు..**



**భూపాలపల్లి జూన్ 20 పీపుల్స్ డైరీ :** నీట్ (రీ-కండక్ట్) పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలలో నీట్ పరీక్ష జరుగనున్నందున డిగ్రీ కళాశాలలో నీట్ పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేసి కంట్రోల్ రూము, పరీక్ష హాళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21, 2026న ఆదివారం జరుగనున్న నీట్ పరీక్షా మధ్యాహ్నం 2.00 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. జిల్లాలో మొత్తం రెండు కేంద్రాలలో 388 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 220 మంది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 168 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో బయోమెట్రిక్ పరికరాలు, సిసిటివి కెమెరాలు, సిగ్నల్ జామర్లు, జనరేటర్ బ్యాకప్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసినట్లు తెలిపారు. విద్యుత్ అంతరాయం జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు. విద్యార్థులను నిశిత పరిశీలన తదుపరి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద తహసిల్దార్, సబ్-ఇన్స్పెక్టర్ మరియు నలుగురు పోలీస్ సిబ్బందితో కూడిన బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు ఆకస్మిక తనిఖీలు చేపడతాయని తెలిపారు. అభ్యర్థులకు బయోమెట్రిక్ ప్రమాణీకరణ, క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలని తెలిపారు. మహిళా అభ్యర్థుల కొరకు ప్రత్యేక ఎన్‌క్లోజర్‌లలో మహిళా సిబ్బంది ద్వారా మాత్రమే తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అవసరమైన మందులతో కూడిన మెడికల్ క్యాంప్ మరియు అత్యవసర సేవల కొరకు అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని అన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో పరిశుభ్రత మరియు పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు.. అత్యవసర పరిస్థితుల కొరకు అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, డీఈఓ రాజేందర్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ రమణా రావు తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కాట్రపల్లి గ్రామ అధ్యక్షుడిగా మడుగుల రాజు నియామకం



**హుజురాబాద్, జూన్ 20: (పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) సాధన కమిటీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో కమిటీ బలోపేతానికి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కాట్రపల్లి గ్రామానికి ఆర్‌టీఐ సాధన కమిటీ గ్రామ అధ్యక్షుడిగా మడుగుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన గ్రామ అధ్యక్షుడు మడుగుల రాజు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్‌కు, అలాగే తన నియామకానికి సహకరించిన హుజూరాబాద్ మండల ప్రధాన కార్యదర్శి బండ నరేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్థాయిలో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి మరియు కమిటీ ఆశయాల సాధనకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వ సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావడం, పారదర్శక పాలనకు తోడ్పడటం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మడుగుల రాజు నియామకం పట్ల కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో ఆర్‌టీఐ చట్టంపై మరింత చైతన్యం తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు

పీపుల్స్ డైరీ
వరంగల్
ఆదివారం, 21 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 107


# బిసిఐ ప్రాజెక్ట్ ఎస్ బి ఐ ఆర్ఎస్ఈటీఐ ల మగ్గం వర్క్ నెల రోజుల ఉచిత శిక్షన కార్యక్రమం



**వీణవంక జూన్ 20( పీపుల్స్ డైరీ ) :** కొండపాక గ్రామం లో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ ఇండియా నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ వారు బిసిఐ ప్రాజెక్ట్ ఎస్ బి ఐ ఆర్ఎస్ఈటీఐ వారు సంయుక్తంగా మగ్గం వర్క్ (నెలరోజుల ఉచిత ) శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిసిఐ క్లస్టర్ కోఆర్డినేటర్ మహేందర్ మాట్లాడుతూ రైతు కుటుంబ సభ్యుల జీవనోపాది పెంపొందించడంలో భాగంగా వివిధ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల భాగస్వామ్యం తో వివిధ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భాగంగానే గ్రామంలో బేస్ లైన్ సర్వే నిర్వహించి అక్కడి మహిళల ఆసక్తులకు అనుగుణంగా మగ్గం వర్క్ కి సంబంధించిన శిక్షణ కార్యక్రమాన్ని వారి గ్రామంలోనే ఏర్పాటు చేయడం జరిగిందని శిక్షణలో పాల్గొనే ప్రతి మహిళ తమ నైపుణ్యాలను పెంపొందించుకొని వారు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, వారితో పాటు ఇతరులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రతి విషయంలో నిర్ణయాధికారం పెంపొందించుకునే దిశగా అడుగులు వేయాలని తెలపడం జరిగింది. ఎస్ బి ఐ ఆర్ఎస్ఈటీఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు యువత ఉపాధి పొందేలా స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలు అందిస్తున్నామని మహిళల కోసం కుట్టు శిక్షణ, జూట్ బాగ్స్ తయారీ, అగర్వత్తుల తయారీ కుట్టు శిక్షణ వంటి కార్యక్రమాలు రూపొందించామని యువతకు సెల్ ఫోన్ రిపేర్, రిఫ్రిజిరేటర్ రిపేర్ వంటి కార్యక్రమాలు రూపొందించామని, శిక్షణ అనంతరం వారు స్వయంగా బిజినెస్ ఏ విధంగా చేసుకోవాలో కూడా తెలియచేస్తామని, వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాట్ల విరస్వామి ఉప సర్పంచ్ కుమార్, పాలక వర్గం, పంచాయతీ సెక్రెటరీ తిరుపతి, స్కూల్ హెడ్మాస్టర్ రాజయ్య,,బీసీఐ అసిస్టెంట్ మేనేజర్ మల్లేష్, బీసీఐ స్టాఫ్ సౌజన్య, మోహన్, అనిల్, కుమార్, ట్రయినర్ రజిత, ఫాకల్టీ విజయ్ కుమార్, 30 మంది మగ్గం వర్క్ లబ్ధిదారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు

# అల్టిట్యూడ్ పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**ఎల్కతుర్తి జూన్ 20 (పీపుల్స్ డైరీ):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హై స్కూల్లో శనివారం ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించారు. యోగా యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పుష్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ యోగా ప్రతి విద్యార్థి జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉండాలని అన్నారు. యోగా శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా మానసిక ప్రశాంతతను అందిస్తుందని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్రి అశోక్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద అని అన్నారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే యోగాను అలవాటు చేసుకుంటే ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపల్ లింగం మొగిలి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, ఉపాధ్యాయులు సరిత, సురేష్, కృష్ణ, రమేష్, కావ్య, కవిత, అనుష, స్వప్న, గీత, రక్షణ, రమ్య, రచన, మౌనిక, భవాని తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం యోగా వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.



# వాలీబాల్ ఆటస్థలం కోసం దమ్మపేట యువత ఎదురుచూపులు

- ఆటకు ఆదరణ ఉన్నా మైదానం కరువు
- ప్రభుత్వం ప్రత్యేక స్థలం కేటాయించాలని యువత విజ్ఞప్తి

**దమ్మపేట, జూన్ 20(పీపుల్స్ డైరీ) :** దమ్మపేట పట్టణంలో వాలీబాల్ ఆటకు విశేష ఆదరణ ఉన్నప్పటికీ, సరైన ఆటస్థలం లేక యువత ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఖాళీ ప్రదేశాలు, రహదారుల పక్కన లేదా తాత్కాలిక స్థలాల్లో వాలీబాల్ ఆడుకుంటూ తమ క్రీడా ఆసక్తిని కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో వాలీబాల్ ఆడేందుకు చేరుకుంటుండగా, ఆటను వీక్షించేందుకు కూడా రెండు నుంచి మూడు వందల మంది వరకు ప్రేక్షకులు వస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో వాలీబాల్ క్రీడకు దమ్మపేటలో ఉన్న ఆదరణ స్పష్టమవుతోంది. అయితే సరైన మైదానం లేకపోవడంతో ఆటగాళ్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, ఆటలను నిర్వహించడం కష్టంగా మారుతోందని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆరోగ్యానికి, యువతకు ఉపయోగకరమైన క్రీడ

వాలీబాల్ వంటి క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రోజువారీ ఒత్తిడిని తగ్గించడంలో కూడా క్రీడలు ఎంతో ఉపయోగపడతాయి. అయినప్పటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమస్యపై ఇప్పటివరకు ప్రత్యేక దృష్టి సారించలేదని యువకులు విమర్శిస్తున్నారు.

### ప్రభుత్వం భూమి కేటాయించాలి

దమ్మపేటలో వాలీబాల్ మైదానం కోసం ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలు కొంత భూమిని కేటాయిస్తే యువత స్వచ్ఛందంగా అభివృద్ధి చేసుకుని క్రీడా కార్యకలాపాలను



నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.

### క్రీడలకు ప్రోత్సాహం ఎక్కడ

యువత ప్రతిభను వెలికితీయాలంటే ముందుగా క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందని క్రీడాభిమానులు అభిప్రాయపడుతున్నారు. దమ్మపేటలో వాలీబాల్ మైదానం ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోవాలని యువత కోరుతున్నారు.

# పూర్వ ప్రాథమిక పాఠశాలల నియామకాల్లో ప్రభుత్వ విద్యార్థుల కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలి




**శంకరపట్నం జూన్ :20 పీపుల్స్ డైరీ:** కరీంనగర్ జిల్లాకు ఇటీవల మంజూరైన 58 పూర్వ ప్రాథమిక పాఠశాలల నిర్వహణ కోసం చేపట్టనున్న 58 మంది బోధకులు, 58 మంది ఆయాల నియామకాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన లేదా ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ రవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాత్కాలిక పద్ధతిలో భర్తీ చేయనున్న ఈ ఖాళీలను ప్రభుత్వ పాఠశాలలతో అనుబంధం ఉన్న కుటుంబాల నుంచే భర్తీ చేస్తే వారు మరింత బాధ్యతతో విధులు నిర్వహిస్తారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక పాఠశాలలు ఆశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే ప్రభుత్వ విద్యపై నమ్మకం ఉంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తున్న కుటుంబాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడం అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేక తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివిస్తున్న వారికి ఈ పోస్టుల్లో అవకాశం కల్పించడం సముచితం కాదని అభిప్రాయ పడ్డారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలంటే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాబట్టి పూర్వ ప్రాథమిక పాఠశాలల నియామక ప్రక్రియను ప్రభుత్వం పునఃపరిశీలించి, ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన లేదా చదువుతున్న విద్యార్థుల కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు శనిగరపు ఐలయ్య, మండల అధ్యక్షుడు ఆరేపల్లి ఓదెలు, కోయడ సమ్మయ్య, మేకల కుమార్, బీసీ సంఘం నాయకుడు రాజమౌళి, ఇటుకల తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది

### బండ సీనివాస్, ఎడవల్లి కొండాల రెడ్డి

**హుజురాబాద్, జూన్ 20 (పీపుల్స్ డైరీ):** దేశానికి వెన్నెముకగా నిలిచిన తెలంగాణ రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ సీనివాస్ మరియు బీఆర్ఎస్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ ఎడవల్లి కొండాల రెడ్డి విమర్శించారు. శనివారం హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని, అదనపు ధాన్యాన్ని కొనుగోలు చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం రైతుల ప్రయోజనాలకు విరుద్ధమని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు రైతులు సాగునీరు, విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఆ పరిస్థితులను మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా సాగునీటి సదుపాయం, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలతో రైతులకు ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాల ద్వారా కోట్లాది రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేశామని, 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో రైతుబంధు పెంపు, పంటలకు బోనస్, చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు కల్లాల వద్దకే వెళ్లి పంటలను కొనుగోలు చేసిందని, మొక్కజొన్న, జొన్న, శనగ, పెసలు, సోయాబీన్ వంటి పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అన్ని పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేసిన రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రిగా ఎందుకు ఆ హామీలను అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కేంద్రం నిర్ణయించిన పరిమితి మేరకే పంటలు కొనుగోలు చేస్తామని చెప్పడం రైతులను మధ్యవర్తుల చేతుల్లోకి నెట్టివేయడమేనని ఆరోపించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రైతులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ఎడవల్లి కొండాల రెడ్డి హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తులో రైతులే తగిన సమాధానం చెబుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంఘం ఐలయ్య, నాయకులు మంద సతీష్, తల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, తులసి లక్ష్మణమూర్తి, కొలిపాక సమ్మయ్య, ఎం. రాజు కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# ఎరువుల దుకాణాల్లో పోలీసు, వ్యవసాయ అధికారుల తనిఖీలు



**హసన్ పర్తి, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** హసన్ పర్తి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులో పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపులో ఉన్న ఎరువుల నిల్వలు, అమ్మకపు రికార్డులు, బిల్లులు, లైసెన్స్ వివరాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం మాత్రమే ఎరువుల విక్రయాలు జరపాలని సూచించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు అందేలా చూడాలని, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, రికార్డుల లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. షాపు యాజమాన్యానికి స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, అనుమతి పత్రాలను తప్పనిసరిగా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్, పోలీసు సిబ్బంది, హసన్ పర్తి మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్లపల్లిలో విస్తృత పరిశుభ్రత పనులు



**పీపుల్స్ డైరీ,గోరికొత్తపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన రహదారులు, వీధులు, కాలనీల్లోని డ్రైనేజీలను శుభ్రపరచి, పేరుకుపోయిన చెత్తా చెదారం, మురుగును తొలగించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా డ్రైనేజీ క్లీనింగ్ పనులు నిర్వహించినట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పంచాయతీ అమలు చేస్తున్న చెత్త సేకరణ విధానాన్ని పాటించాలని సూచించారు. ప్రజల సహకారంతో వెంకటేశ్వర్లపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి మాచర్ల సతీష్ తెలిపారు. గ్రామాభివృద్ధి, పరిశుభ్రత కోసం పంచాయతీ నిరంతరం చర్యలు చేపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



ములుగు జిల్లా పరిధిలోని పాఠశాలలు మరియు వసతి గృహాల్లో బియ్యం నాణ్యత, వంటల నాణ్యతకు సంబంధించి ఎ.ఎం. టెక్నికల్ సివిల్ సప్లైస్ శ్రీ షేక్ ఇర్ఫాన్, ఎస్ఐ (రిటైర్డ్) శ్రీ పి. జంగయ్యలతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ శ్రీ ఎ. రాహుల్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బండారుపల్లి గ్రామంలోని టీజీఎంఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి దేవకి, టీజీఆర్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ టి. విజయేందర్ సమక్షంలో పాఠశాలలను సందర్శించిన అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహార నాణ్యత, రుచి, వంట విధానం తదితర అంశాలపై విద్యార్థులతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు, విద్యార్థులకు అందించడంలో ముందంజలో ఉంటుందని అధికారులు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నాణ్యమైన భోజనాన్ని అందించాలి

### పాఠశాలలను తనిఖీ చేసిన అధికారులు



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులు సూచించారు. ఈ మేరకు శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని పాఠశాలలతో పాటు వసతి గృహాలను ఎ.ఎం. టెక్నికల్ సివిల్ సప్లైస్ షేక్ ఇర్ఫాన్, ఎస్ఐ (రిటైర్డ్) పి. జంగయ్యలతో పాటు టెక్నికల్ అసిస్టెంట్ ఎ. రాహుల్‌లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బండారుపల్లి గ్రామంలోని టీజీఎంఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవకి, టీజీఆర్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. విజయేందర్ సమక్షంలో పాఠశాలలను సందర్శించిన అధికారులు విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయటం తోపాటు ఆహార నాణ్యత, రుచి, వంట విధానం తదితర అంశాలపై విద్యార్థులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశం లో వారు మాట్లాడారు. తెలంగాణ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు, విద్యార్థులకు అందించడంలో ముందంజలో ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీపుల్స్ డైరీ
వరంగల్
ఆదివారం , 21 జూన్ 2026
సంపుటి : 18, సంచిక : 107


## ప్రభుత్వ ఆసుపత్రి నందు చేతి బోరు ఏర్పాటు



**ఆళ్ళపల్లి జూన్ 20(పీపుల్స్ డైరీ) :** ఆళ్ళపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి ఆవర్నలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రి కీ వచ్చే రోగులకు అవసరం కొరకు గత పర్యనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు చేతి బోరు ఎపించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆళ్ళపల్లి సర్పంచ్ వాసం సుష్మిత ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆళ్ళపల్లి కాంగ్రెస్ పార్టీ కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్ ప్రముఖ వ్యాపారస్థులు గౌరిశెట్టి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు పానుగంటి మంగ రామానుజగూడెం సర్పంచ్ మోకాళ్ళ చెంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలంగాని శ్రీను వాళ్ళలా నాగం గొగ్గేల కాంతు కుంట వెంకటరాములు వార్డు సభ్యులు గౌరబోయిన సీత ఆస్పత్రి స్టాప్ తదితరులు పాల్గొన్నారు

## హైవోల్టేజీతో కాలిపోతున్న ఫ్యాన్లు, కూలర్లు

**నెల రోజులుగా సైదాపూర్ పాత బస్టాండ్ ఆవరణలో సమస్య**



**సైదాపూర్ జూన్ 20 ( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ పాత బస్టాండ్ ఆవరణలో హైవోల్టేజీ కరెంటుతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల రోజులుగా వస్తున్న హెచ్చుతగ్గుల విద్యుత్ సరఫరా కారణంగా ఇళ్లలోని ఫ్యాన్లు, కూలర్లు కాలిపోతుండటంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఎండల తీవ్రత, మరోవైపు హైవోల్టేజీతో నిలువునా దహనమవుతున్న విద్యుత్ ఉపకరణాలతో జనం ఆర్థికంగా నష్టపోతున్నారు. అధిక లోడు వల్లే ఈ సమస్య తలెత్తుతోందని విద్యుత్ శాఖ సిబ్బందికి స్పష్టంగా తెలిసినప్పటికీ, ప్రత్యామ్నాయ మార్గాలు చూపి సమస్యను పరిష్కరించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే నెల రోజులుగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి, పాత బస్టాండ్ ఆవరణలో ఉన్న విద్యుత్ లోడు పరిస్థితిని సరిగ్గా అంచనా వేయాలని సామాజిక కార్యకర్త పైడిపల్లి రవీందర్ గౌడ్ కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సరైన చర్యలు తీసుకుని, ఈ హైవోల్టేజ్ సమస్యను తక్షణమే శాశ్వతంగా పరిష్కరించాలని ఆయన, పాత బస్టాండ్ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## యాదవ సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడికి సన్మానం



**జగిత్యాల జూన్ 20:(పీపుల్స్ డైరీ) :** యాదవ సంఘ బలోపేతం కోసం సమస్యల పరిష్కా రం యాదవ హక్కుల సాధ న కోసం జిల్లా వ్యాప్తంగా గ్రా మ గ్రామాన సంఘ సమా వేశాలు నిర్వహిస్తూ సభ్య త్వ నమోదు చేస్తూ సంఘ బలోపేతం కోసం కృషి చేస్తు న్న సందర్భంగా యాదవ సంఘ జగిత్యాల జిల్లా వ్య వస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ ని జిల్లా కా ర్యవర్గ సభ్యులు రెబ్బాస్ మల్లన్న,మోతుకు మహేష్, గోవర్ధన్ స్థానిక సర్పంచ్ ఎ దుల శేఖర్ యాదవు లను శాలువాతో సన్మానించిన అ భినందనలు తెలిపిన రంగ పేట గ్రామ యాదవ సంఘ సభ్యులు.సన్మానించి అభి నందనలు తెలిపిన యాద వ సంఘ సభ్యులందరికి జి ల్లా అధ్యక్షులు గనవేని మ ల్లేష్ యాదవ్ హృదయ పూ ర్వక ధన్యవాదములు తెలి పారు

## హుజురాబాద్ బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడిగా జూపాక ఉపసర్పంచ్ మహేందర్ జీ నియామకం




**హుజురాబాద్, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** కరీంనగర్ జిల్లా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్ ఆదేశాల మేరకు హుజురాబాద్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడిగా జూపాక గ్రామ ఉపసర్పంచ్ మహేందర్ జీని నియమించారు. హుజన్ సమాజ్ పార్టీలో జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడు వంటి పలు కీలక బాధ్యతలను నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తించిన పార్టీ అధిష్ఠానం ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, కార్యకర్తలను సమన్వయం చేయడం, బహుజన వర్గాల సమస్యలపై పోరాటం చేయడంలో మహేందర్ జీ చురుకైన పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం జూపాక గ్రామ ఉపసర్పంచ్‌గా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఆయనకు ఈ పదవి దక్కడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా మహేందర్ జీ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గంలో బీఎస్పీని మరింత బలోపేతం చేసి, బహుజన వర్గాల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## హరీష్ రావు వేల అవినీతికి సంబంధించిన ఆధారాలతో సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేస్తా

- **మాజీ మంత్రి హరీష్ రావుపై అవినీతి ఆరోపణలు-కాంగ్రెస్ నేత తిప్పారపు సంపత్ ఆరోపణలు**




**హుజురాబాద్, జూన్ 20: ( పీపుల్స్ డైరీ) :** మాజీ మంత్రి హరీష్ రావు వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, దీనికి సంబంధించిన ఆధారాలతో త్వరలోనే సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేస్తానని కాంగ్రెస్ నాయకుడు తిప్పారపు సంపత్ తెలిపారు. శనివారం హుజురాబాద్ పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తిప్పారపు సంపత్ మాట్లాడుతూ, మాజీ మంత్రి హరీష్ రావు తనపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, అయితే వాటికి తాను భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హరీష్ రావు హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు, వైద్య ఆరోగ్య శాఖలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. కాగ్ నివేదికలు, సంబంధిత విచారణ నివేదికల్లో అనేక అక్రమాలు వెలుగుచూశాయని, వైద్య ఆరోగ్య శాఖలో వందల కోట్ల రూపాయల వ్యయాలకు సంబంధించిన సరైన ఆధారాలు, రికార్డులు, బిల్లులు లేవని పేర్కొన్నారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో వైద్య రంగంలో అనేక ఖాళీ పోస్టులు భర్తీ కాలేదని, వైద్య సేవలపై తగినంత వ్యయం జరగలేదని ఆయన విమర్శించారు. ఫార్మాసిటీ భూముల కేటాయింపుల్లో కూడా భారీ అవినీతి జరిగిందని, దీనిపై పూర్తి ఆధారాలను త్వరలోనే సీబీఐ, ఈడీ అధికారులకు సమర్పిస్తానని తెలిపారు. ప్రజల ముందు బహిరంగ చర్చకు రావాలని హరీష్ రావుకు సవాల్ విసిరారు .ప్రజలకు నిజాలు తెలియజేయడమే తన ఉద్దేశమని, అవినీతిపై పోరాటాన్ని కొనసాగిస్తానని తిప్పారపు సంపత్ పేర్కొన్నారు. గమనిక: పై ఆరోపణలు కాంగ్రెస్ నాయకుడు తిప్పారపు సంపత్ చేసినవే. ఈ ఆరోపణలపై సంబంధిత వ్యక్తుల స్పందన లేదా అధికారిక విచారణ ఫలితాలు వెలువడాల్సి ఉంది.

## లోక్ అదాలత్ లతోనే స త్వర న్యాయం -జూనియర్ సివిల్ జడ్జి వి నుకొండ మాధవి



**మెట్ పల్లి జూన్ 20: (పీపుల్స్ డైరీ) :** లోక్ అదాలత్ ల ద్వారానే కక్షిదారులకు సత్వర న్యా యం జరుగుతుందని మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి అన్నా రు.మండల్ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో శనివారం మె ట్ పల్లి కోర్టులో న్యాయ వి జ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ,పరస్పరం కక్షిదారు లు సమస్యని రాజీ చేసుకో వడం వల్ల సమయంతో పా టూ ఖర్చులు కూడా ఆదా అవుతాయాని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ అయినా కేసుల్లో అప్పీల్ కూడా ఉండదని తెలిపారు. అనంతరం నిర్వహించిన రెండవ జాతీయ మెగా లోక్ అదాలత్ లో మొత్తం 1645 కేసుల్ని పరిష్కారం చేసారు. ఇట్టి కేసుల్లో పరస్పరం రాజీ ద్వారా 97, మీడియాషన్ ద్వారా 16, అడ్మిషన్స్ ద్వా రా 58, పియల్సి ద్వారా 25,ఎస్టీసీ ద్వారా 1449 లు ఉన్నాయి. అడ్మిషన్స్ ద్వా రా రూపాయలు 4,56,20 0 లను కక్షిదారులు చెల్లిం చారు.పియాల్సి ద్వారా బ్యాంకు లకు రూపాయలు 6,78,629 లను రైతులు చె ల్లించారు. ఈ కార్యక్రమం లో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దయ్యా రాజారాం, ఏపీపి జి.ప్రణయ్, బార్ అసోసియే షన్ అధ్యక్షులు ఏలేటి రా మ్ రెడ్డి, లోక్ అదాలత్ మెం బెర్స్ వడ్డేపల్లి శ్రీనివాసన్, జే డి సుధాకర్, మీడియాషన్ సభ్యులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వే ణుగోపాల్, పసునూరి శ్రీని వాస్, న్యాయవాదులు జి ల్లా వెంకటేశ్వర్లు, మగ్గిడి వెంకట నర్సయ్,గడ్డం శం కర్ రెడ్డి, పోలకొండ దయా కర్ వర్మ, పుప్పాల భాను మూర్తి, వేముల సునీల్, ప సునూరి సుదర్శన్,మామి డిపల్లి విజయలక్ష్మి, పడిగేల శ్రీనివాస్, గజ భీంకర్ వెంక టేష్, నీరటి రమణ,మార్క వంశీ,తలారి రాజశేఖర్, కో ల అశోక్, ద్యావని సత్యానా రాయణ,అందె సంజయ్ కు మార్,తుల రాజేందర్ మరి యు పోలీస్ సిబ్బంది పాల్గొ న్నారు .


## గుడిసె లేని నియోజకవర్గమే నా లక్ష్యం-ప్రణవ్ బాబు

**సొంత ఇంటి కల నెరవేరుస్తున్న నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబు**



**కమలాపూర్ జూన్ 20 (పీపుల్స్ డైరీ ) :** కమలాపూర్ మండల కేంద్రంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు కాంగ్రెస్ అందించిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా లబ్ధి పొందిన బైరి రాజమణి– బిక్షపతి నూతన గృహప్రవేశం కార్యక్రమం లో హుజూరాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ప్రణవ్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మౌటం కుమార స్వామి పాల్గొని లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బైరి రాజమణి బిక్షపతి కాంగ్రెస్ ప్రభుత్వం, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు అందించిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మా ఇంటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తపరుస్తూ, ప్రణవ్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ నిరుపేదలకు అండగా ఉంటుందని పేదలకు కష్టాల్లో ఉంటే ప్రణవ్ బాబు ముందుంటాడని ఇండ్లు లేని గుడిసెలు లేని నియోజకవర్గంగా హుజురాబాద్ ను తీర్చిదిద్దే ప్రయత్నంలో ముందు ఉంటాడని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంకుష్, వార్డ్ మెంబర్స్ మార్కా అశోక్, గంధ సిరి అనిల్, పోడేటి రాజు, మౌటం బన్నీ పాల్గొనడం జరిగింది

## నూతన వధూవరులను ఆశీర్వదించిన వొడితల ప్రణవ్



**హుజురాబాద్, జూన్ 20: (పీపుల్స్ డైరీ) :** హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ శనివారం నియోజకవర్గంలోని పలు వివాహ శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రణవ్, వారి దాంపత్య జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆయన నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ముచ్చటించిన ప్రణవ్, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కవిత కు రేవంత్ రెడ్డి స్క్రిప్ట్..

**కల్వకుంట్ల కవిత పై మాజీ ఎమ్మెల్యే గండ్ర ఫైర్..**



**భూపాలపల్లి జూన్ 20 పీపుల్స్ డైరీ :** కల్వకుంట్ల కవిత కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ రాసి ఇస్తున్నారని అందుకే బి ఆర్ ఎస్ నాయకులపై ఆరోపణలు చేసున్నారంటు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, మండిపడ్డారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో టి ఆర్ ఎస్ పార్టీ వేవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత పర్యటించరు ఈ సందర్భంగా జెండా పండగ లో భాగంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడతు. బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గండ్ర వెంకట రమణారెడ్డి భూపాలపల్లి జిల్లాలో అనేక భూములు కబ్జా చేసారని ఆరోపణలు చేశారు. జిల్లా కేంద్రంలో 136 ఎకరాలు కబ్జా చేసి భూపాలపల్లి లో పెద ప్రజలను మోసం చేసారంటు ఆరోపించారు..అప్పుడు ఆ గండ్ర మోసం చేస్తే ఇప్పుడు వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడ మోసం చేస్తున్నాడు అని అన్నారు.. కవిత మాటలకు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణ రెడ్డి, ఘాటుగా సమాధానం ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం లో కవిత మాటలకు సమాధానం ఇచ్చారు. కల్వకుంట్ల కవితకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ రాసి ఇస్తున్నాడు అందుకే అదికార పార్టీ నేతలను వదిలేసి ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసి మాట్లాడడం వెనక రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ రాసి ఇచ్చినట్టు కనబడుతుంది అన్నారు. బి ఆర్ ఎస్ పార్టీలో ఉన్నపుడు ఒక మాట పార్టీ మారినప్పుడు ఒక మాట మాట్లాడటం ఆమె చెల్లుతుంది అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 136 ఎకరాలు భూమి కబ్జా చేసినట్టు కవిత నిరూపించాలి అన్నారు. భూపాలపల్లి లో ఎకో పార్క్ కోసం భూమి ఏర్పాటు చేసాం అందులో మొక్కలు నాటి ప్రజల అవసరలా కోసం ఏర్పాటు చేస్తే అలాంటి భూమి పై కోర్టులో కేసు వేస్తే మాజీ ఎంపీ వినోద్ కుమార్ చొరవతో కేసు లేకుండ చేశామన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యే లు చేస్తున్న అరాచకాలు మోసాలు కవిత కు కనపడటం లేదా అని ప్రశ్నించారు. రైతులకు యూరియ యాప్ ద్వారా తీసుకోవాలి అని రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన నిబంధన పై కవిత పోరాడాలన్నారు. కానీ ప్రతి పక్ష నేతలను టార్గెట్ చేయడం వల్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వన్ని కాపాడటానికి చేస్తున్న ప్రయత్నంల కనపడుతుంది అని తెలిపారు..

## గొల్లగూడెంలో దగ్ధమైన 600 వరిగడ్డి కట్టలు..

**మంటలను ఆర్పిన ఫైర్ ఇంజన్-రైతు కొరిమి సతీష్ తీవ్ర నష్టం**



**సైదాపూర్ జూన్ 20 ( పీపుల్స్ డైరీ) :** ఆరుగాలం శ్రమించి పశువుల గ్రాసం కోసం అపురూపంగా దాచుకున్న వరిగడ్డి వాము అగ్నిపాలైంది. కక్షపూరిత నేపథ్యంతో తోటి రైతే నిప్పు పెట్టడంతో సుమారు 600 గడ్డి కట్టలతో పాటు, వ్యవసాయానికి వినియోగించే బోరు మోటారు పైపు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ఘటన శనివారం సైదాపూర్ మండలం గొల్లగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సైదాపూర్ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన రైతు కొరిమి సతీష్ తన వ్యవసాయ పొలం వద్ద పశువుల మేత నిమిత్తం సుమారు 600 వరి గడ్డి కట్టలను నిల్వ చేసుకున్నాడు. అయితే, అదే గ్రామానికి చెందిన మరో రైతులు తిప్పారపు దినేష్,తండ్రి రాజయ్య లు ఉద్దేశపూర్వకంగా ఈ గడ్డి కట్టలకు నిప్పు పెట్టినట్లు బాధితుడు సతీష్ ఆరోపిస్తున్నాడు. ఎండిన గడ్డి కావడంతో మంటలు క్షణాల్లోనే ఎగసిపడ్డాయి. చూస్తుండగానే గడ్డి వాము అంతా కాలి బూడిద కుప్పగా మారింది. మంటల తీవ్రతకు సమీపంలో అమర్చిన బోరు మోటారు పైపు సైతం పూర్తిగా కరిగిపోయి నష్టం వాటిల్లింది. కళ్లెదుటే పశువుల గ్రాసం కాలిపోవడంతో రైతు సతీష్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. ఎండాకాలంలో మూగజీవాలకు మేత ఎలా అని ఆందోళన చెందుతున్నాడు. గడ్డి కట్టలతో పాటు మోటారు పైపు కాలిపోవడంతో 2లక్షల మేరా ఆర్థికంగా తీవ్ర నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఒక రైతై ఉండి, మరో రైతు కడుపు కొట్టేలా తిప్పారపు దినేష్,రాజయ్య వ్యవహరించిన తీరు పట్ల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన రైతు గ్రామస్తులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, ఘటనపై విచారణ జరిపి నిందితుడిపై చర్యలు తీసుకోవాలని, అలాగే తనకు తగిన నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని బాధిత రైతు సతీష్ ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

# మోనాలిసాకు రక్షణ కల్పించండి

- **కేరళ హైకోర్టు ఉత్తర్వులు**
- **కుంభమేళా వైరల్ గర్ల్‌కు ప్రాణహాని ఉందట**

పీపుల్స్‌డైరీ–వెబ్‌డెస్క్ : ఫేస్‌బుక్ ప్రేమ, మతాంతర వివాహం, కిడ్నాప్ కేసులతో జాతీయస్థాయిలో సంచలనంగా మారిన కుంభమేళా మోనాలిసా కేసులో కేరళ హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. పెద్దలను ఎదిరించి ముస్లిం యువకుడిని పెళ్లాడిన తనకు పుట్టింటివారి నుంచి తీవ్ర ప్రాణహాని ఉందంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. పిటిషన్ తేలేవరకు ఆమె ప్రాణాలకు పూర్తి భద్రత కల్పించాలని కేరళ పోలీసులను ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవే...

దేశవ్యాప్తంగా సోషల్ మీడియా వేదికగా విపరీతంగా వైరల్ అయిన కుంభమేళా మోనాలిసా ఉదంతం ఇప్పుడు ఒక పెద్ద చట్టపరమైన, దౌత్యపరమైన మలుపు తిరిగింది. మతాంతర వివాహం చేసుకున్న తనకు, తన భర్తకు తీవ్ర ప్రాణహాని ఉందంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై కేరళ హైకోర్టు శనివారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ రిట్ పిటిషన్‌పై తుది నిర్ణయం వచ్చేంత వరకు సదరు యువతికి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించాల్సిందిగా కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాంగాన్ని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను జులై 10వ తేదీకి వాయిదా వేసింది.

**ఫేస్‌బుక్ ప్రేమ.. ఆలయంలో మతాంతర వివాహం!**

కుంభమేళాలో వ్లాగర్లు తీసిన ఫోటోలు, వీడియోలతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న మోనాలిసాకు.. మహారాష్ట్రకు చెందిన ఫర్మాన్ ఖాన్ అనే యువకుడితో గతంలో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్తా ప్రేమగా మారింది. దాదాపు ఎనిమిది నెలల పాటు ప్రేమాయణం సాగించిన ఈ జంట.. ఇరు వర్గాల మతాలు వేరైనప్పటికీ పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే కేరళలోని తిరువనంతపురంలో ఉన్న ఒక



హిందూ దేవాలయంలో వీరిద్దరూ సాంప్రదాయబద్ధంగా వివాహం చేసుకున్నారు. పెళ్లయినప్పటి నుంచి ఈ కొత్త జంట కేరళలోనే నివాసం ఉంటున్నారు.

**రంగంలోకి మధ్యప్రదేశ్ పోలీస్.. పోక్సో కేసు నమోదు!**

అయితే మోనాలిసా వివాహం చేసుకున్న తర్వాత ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె ఇంకా మైనర్ అని, ఆమెను ఫర్మాన్ ఖాన్ అపహరించాడంటూ మధ్య ప్రదేశ్‌లోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మధ్యప్రదేశ్ పోలీసులు ఫర్మాన్ ఖాన్‌పై కిడ్నాప్, తీవ్రమైన పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుల నేపథ్యంలోనే తమను పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని, మరోవైపు తమ ప్రాణాలకు తీవ్ర ముప్పు పొంచి ఉందంటూ మోనాలిసా కేరళ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది.

ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలించిన కేరళ హైకోర్టుకు చెందిన మరో ధర్మాసనం ఈ నెల ప్రారంభంలోనే నిందితుడిగా ఉన్న భర్త ఫర్మాన్ ఖాన్‌కు పెద్ద ఊరటనిచ్చింది. కిడ్నాప్, పోక్సో కేసులలో ముందస్తు బెయిల్ పొందేందుకు వీలుగా, మధ్యప్రదేశ్ కోర్టును ఆశ్రయించడానికి అతనికి నెల రోజుల పాటు ట్రాన్సిట్ బెయిల్ మంజూరు చేసింది. ఈ గడువు లోపు అతను మధ్యప్రదేశ్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి ఉంటుంది. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.




## ప్రభుత్వ స్కూల్లో నోట్ బుక్స్ పంపిణీ

**పీపుల్స్‌డైరీ–వరంగల్ :** ఖిలా వరంగల్ తూర్పు కోట లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (సంఘం బడి)లో శ్రీ అవెన్యూ ఇన్ఫ్రా డెవలపర్స్ చైర్మన్, పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ అల్లం రాజేశ్ వర్మ విద్యార్థులకు నోటుబుక్స్, ఇతర స్టేషనరీ, బిస్కెట్లు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ సైకాలజిస్ట్ పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు బరుపటి గోపి, సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్లం నరేందర్, పెరికకుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బెడిద వీరన్న మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. విద్యార్థులు చిన్నతనం నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకు సాగాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కర్రే శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా కోశాధికారి వనపర్తి ధర్మరాజు, జర్నలిస్టు సంగని శివ, సుంచు వీరన్న, ఏసిరెడ్డి ప్రభాకర్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటును కాపాడుకోండి...

(మొదటి పేజీ తరువాయి)

చేయనున్నట్లు సీఈవో వెల్లడించారు. అదే విధంగా ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాం వస్తుందని సీఈవో తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగిస్తారని స్పష్టం చేసారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును ఎన్రోల్మెంట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమని.. ఓటర్లను తొలగించడం కాదు స్పష్టం చేశారు. 24 ఏళ్లుగా ఇక్కడ ఓటర్ జాబితా శుద్ధి జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారని.. కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని చెప్పారు. ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ ఉందన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఎన్యూమరేషన్ ఫాం ఇస్తారని తెలిపారు. కులం, మతంతో సంబంధం లేకుండా అందరికీ ఫాం ఇస్తారన్నారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసర లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి భరోసా ఇచ్చారు.




## భగీరథ్‌కు రిలీఫ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసును నమోదు చేశారు. గత ఆరు నెలలుగా భగీరథ్ తమ కుమార్తెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మానసికంగా వేధించాడని ఆ తల్లి ఆరోపించింది. మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌లో బాలికకు బలవంతంగా మద్యం తాగించి, అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు భగీరథ్‌పై పోక్సో చట్టం సెక్షన్ 11 కింద కేసు నమోదు చేశారు.



ఈ కేసు తీవ్రత దృష్ట్యా సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. అరెస్టు నుంచి తప్పించుకోవడానికి భగీరథ్ తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, కేసు తీవ్రతను పరిశీలించిన హైకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. హైకోర్టు బెయిల్ నిరాకరించడంతో పోలీసులు భగీరథ్ కోసం గాలింపు ముమ్మరం చేశారు. లుకౌట్ నోటీసులు జారీ చేసి, హైదరాబాద్, కరీంనగర్ పరిసరాల్లో ఐదు ప్రత్యేక బృందాలతో వెతికారు. అనంతరం మే 16 పోలీసులు బండి భగీరథ్‌ను నార్సింగి సమీపంలోని టీజీపీఏ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు.

ఈ నేపథ్యంలోనే భగీరథ్ లాయర్లు జిల్లా కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య హోరాహోరీగా వాదనలు జరిగాయి. బండి భగీరథ్ తరఫున వాదించిన సీనియర్ కౌన్సిల్.. ఈ కేసులో భగీరథ్‌కు ఎలాంటి ప్రత్యక్ష ప్రమేయం లేదని, కేవలం రాజకీయ ప్రాధాన్యత ఉన్న కుటుంబం కావడంతోనే కావాలని కొందరు ఈ కేసులోకి లాగారని న్యాయస్థానానికి వివరించారు. దర్యాప్తునకు భగీరథ్ పూర్తిస్థాయిలో సహకరిస్తారని, సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశం లేదని కాబట్టి ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరువర్గాల వాదనలను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి.. కేసు తీవ్రతను, నిందితుడి పూర్వాపరాలను పరిగణనలోకి తీసుకుని చివరికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

## చర్లపల్లి పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా అధికారులు







**పీపుల్స్‌డైరీ–నడికూడ :** ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించనున్నది. ఇందులో భాగంగా నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగింది. పాఠశాలలో గదులు, భౌతిక వసతులను పరిశీలించుటకు ఏర్పాటుచేసిన జిల్లా తనిఖీ బృందం వంగల శ్రీపాల్ రెడ్డి, వల్లంపట్ల శ్యాంసుందర్ చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించి ప్రీ ప్రైమరీ కేటాయించబడిన ప్రత్యేక తరగతి గది అందుబాటులో ఉండడం, తరగతి గది మంచి స్థితిలో ఉండటం, పెయింటింగ్ వేయుటకు అనుకూలంగా ఉన్నదా లేదా? పిల్లలకు అనుకూలమైన గోడ చిత్రాలు ఉన్నాయా లేవా? తగినంత వెలుతురు ఉందా లేదా? విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉన్నదా లేదా ఫ్యాన్లు, లైట్లు పని చేస్తున్నాయా..? తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్డి, చేతులు కడుక్కోవడానికి సౌకర్యం, ప్రహరీ గోడ / కంచె అందుబాటులో ఉందా లేదా? తదితర విషయాలను సమగ్రంగా పరిశీలించి ప్రీ ప్రైమరీ తరగతి గదికి కావలసినవి అన్నీ భౌతిక వసతులు సిద్ధంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్చ సుదర్శన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజు కుమార్, పుల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చిన్నశెట్టి గోపి సేవలు

**ఎమ్మెల్యేకు అండగా...**
**ప్రజలకు భరోసాగా...**

దమ్మపేట, జూన్ 20(పీపుల్స్ డైరీ) : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీ బలోపేతంతో పాటు గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుల్లో చిన్నశెట్టి గోపి ఒకరిగా గుర్తింపు పొందుతున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన ముందుంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటి పరిష్కారం కోసం అధికారులతో చర్చించడం గోపి ప్రత్యేకతగా నిలుస్తోంది. ముఖ్యంగా విద్యుత్ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, రోడ్ల మరమ్మతులు, సంక్షేమ పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలపై ఆయన చొరవ చూపుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

**విద్యుత్ సమస్యల పరిష్కారంలో చొరవ**

గ్రామాల్లో తరచూ ఎదురయ్యే విద్యుత్ అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ లోపాలు, లైన్ సమస్యలపై విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపించేందుకు గోపి కృషి చేస్తున్నారని ప్రజలు అభినందిస్తున్నారు. సమస్యలపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు.

**పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర**

కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను గ్రామస్థాయిలో విజయవంతం చేయడంలో కూడా చిన్నశెట్టి గోపి కీలక పాత్ర పోషిస్తున్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**ప్రజా సేవే ధ్యేయం**

ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ నిరంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న చిన్నశెట్టి గోపి, గ్రామాభివృద్ధి మరియు ప్రజా సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని పేర్కొంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా



ఆయనకు స్థానికంగా మంచి గుర్తింపు లభిస్తోంది.

## మండల రాములు కుటుంబానికి పరామర్శ

**వరంగల్, జూన్ 20 (పీపుల్స్‌డైరీ) :** వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన మండల రాములు ( రామ్ రెడ్డి ) ఇటీవల మరణించారు. శనివారం ఆరోవ రోజు సంతాప సభలో బతుకమ్మ గ్రూప్ మహిళా సభ్యులు వారి నివాసానికి విచ్చేసి చిత్రపటానికి పులుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ రాములు చేసిన సేవలను కొనియాడారు. వారికి ఇద్దరు కుమారులైన మండల పరశురాములు, నరసింహ రాములు కూడా తండ్రిలాగే ప్రజలలో మంచి పేరును తెచ్చుకున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోల్లేపెల్లి మల్లికాంబ గ్రూప్ సభ్యులు సునీత, ధనలక్ష్మి, రమ సరోజన పుష్ప యాదమ్మ వెంకటలక్ష్మి జీ సునీత సుమలత, స్థానిక లాయర్ బోల్లెపెల్లి రాజశేఖర్ తదితరులు విచ్చేసి పరామర్శించారు.



## ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమావేశానికి నేడు మంత్రి తుమ్మల రాక

**దమ్మపేట, జూన్ 20(పీపుల్స్ డైరీ) :** దమ్మపేట మండలంలోని మల్కారం గ్రామపంచాయతీ పరిధిలో గుత్తావారిగూడెంలోని షిరిడి సాయిబాబా మందిరం వద్ద ఆదివారం నిర్వహించనున్న ఆయిల్ ఫామ్ రైతుల ఆత్మీయ సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరుకానున్నారు. రైతుల సమస్యలు, ఆయిల్ ఫామ్ సాగు అభివృద్ధి, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలపై మంత్రి రైతులతో ప్రత్యక్షంగా చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ కొయ్యల అచ్యుతరావు మాట్లాడుతూ, రైతు బాంధవుడిగా పేరుగాంచిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటనతో ఆయిల్ ఫామ్ రైతులకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి కీలక సందేశం ఇవ్వనున్నట్లు తెలిపారు. మల్కారం, గుత్తావారిగూడెం మరియు పరిసర ప్రాంతాల



రైతులు ఈ సమావేశానికి భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ ఆత్మీయ సమావేశం విజయవంతం కావాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## ఐఐటీ క్యాంపస్‌లో చిరుత హల్ చల్..

**కుక్క గొంతు కొరికి ఎత్తుకెళ్లింది... విషయం తెలిసి విదార్థుల గజగజ**

పీపుల్స్‌డైరీ–ముంబై : ముంబైలోని ఐఐటీ బాంబే క్యాంపస్ లో షాకింగ్ ఘటన జరిగింది. క్యాంపస్ లోకి చిరుతపులి ప్రవేశించింది. స్టాఫ్ హాస్టల్ వద్ద ఉన్న కుక్కపై దాడి చేసింది. కుక్క పీకను కొరికి దాన్ని పట్టుకుని అక్కడి నుంచి పరార్ అయింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డు అయ్యాయి. ఈ ఘటనలో విద్యార్థులు, సిబ్బందికి ప్రాణాపాయం తప్పింది. అయితే క్యాంపస్ లోకి చిరుత ప్రవేశించడంపై అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేల మంది విద్యార్థులు ఉండే ఇలాంటి బహిరంగ ప్రదేశాల్లో క్రూర మృగాలు సంచరించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

జూన్ 19 శుక్రవారం తెల్లవారు జామున 2 గంటల 30 నిమిషాలకు ఈ ఘటన జరిగినట్లు సీసీటీవీలో రికార్డు అయింది. క్యాంపస్ లోని స్టాఫ్ హాస్టల్ వద్ద కారిడార్ లోకి ఒక్కసారిగా చిరుత పులి పరిగెత్తుకుంటూ వచ్చింది. అర్ధరాత్రి కావడంతో విద్యార్థులు, సిబ్బంది అక్కడ లేరు. అయితే కారిడార్ ఓ కుక్క.. ఆ చిరుతను చూసి మొరిగింది. అయితే అప్పటికే గోడ చాటున పొంచి ఉన్న చిరుత ఆహారం కోసం ఎదురు చూస్తోంది. ఇక కుక్క మొరిగిన వెంటనే ఆకలి మీద ఉన్న చిరుత ఒక్కసారిగా శునకం మీదకు దూసుకొచ్చింది. అలా కుక్కపై దాడికి పాల్పడింది. దాని పీక కొరికి ఆ శవాన్ని అక్కడినుంచి లాక్కుని పరిగెత్తింది. ఈ భయానక దృశ్యాలు సీసీకెమెరాలో రికార్డు అయ్యాయి. చిరుత ఆకలిగా ఉండటంతో క్యాంపస్ లోకి దూరి ఉండొచ్చని అనుమానం కలుగుతోంది.

# "ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక బస్టాండ్లు నిర్మిస్తాం"

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**చెల్పూర్‌కు రూ.5 కోట్లు.. గణపురానికి రూ.1 కోటి**

**ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలి**

**కమర్షియల్ కాంప్లెక్స్‌లతో ఆర్టీసీకి అదనపు ఆదాయం సమకూర్చేలా ప్రణాళికలు**

**ఆర్టీసీ, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి స్థలాల పరిశీలన**



**గణపురం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా చెల్పూర్, గణపురం బస్టాండ్ల అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం మండలంలోని చెల్పూర్ గ్రామంలో నూతన బస్టాండ్ నిర్మాణంతో పాటు గణపురం బస్టాండ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఈడీ రాజశేఖర్, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో కలిసి చెల్పూర్ లో ప్రతిపాదిత బస్టాండ్ స్థలాన్ని, గణపురంలోని ప్రస్తుత బస్టాండ్‌ను పరిశీలించారు. భవిష్యత్‌లో ప్రయాణికుల రద్దీ, రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక సదుపాయాలతో కూడిన బస్టాండ్ల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రయాణికులకు విశ్రాంతి గదులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాలు, డిజిటల్ సమాచార వ్యవస్థలు వంటి అన్ని మౌలిక వసతులు కల్పించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే సమయంలో ఆర్టీసీకి అదనపు ఆదాయం వచ్చేలా అవసరమైన ప్రాంతాల్లో కమర్షియల్ కాంప్లెక్స్‌లు, దుకాణ సముదాయాల నిర్మాణాన్ని కూడా ప్రణాళికలో భాగం చేయాలని సూచించారు. చెల్పూర్ బస్టాండ్ నిర్మాణానికి రూ.5 కోట్లు, గణపురం బస్టాండ్ అభివృద్ధికి రూ.1 కోటి నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ నిధులతో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆధునిక బస్టాండ్లను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్రవ్యాప్తంగా విశేష ఆదరణ పొందుతోందన్నారు. ఈ పథకం వల్ల మహిళలకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా వారి ప్రయాణాలు మరింత సులభతరమయ్యాయని పేర్కొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. బస్టాండ్ల అభివృద్ధి ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కట్కూరి రాధిక శ్రీనివాస్, కావటి రజిత రవీందర్, ఎంపీడీవో ఎల్ భాస్కర్, ఉప సర్పంచ్ లు పొనగంటి మలహాల్ రావు, ఓరుగంటి కృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, మాజీ సర్పంచ్ కొత్త పద్మ వెంకటేశ్వర్లు, లక్కం రాములు, బైరగోని తిరుపతి, బోల్ల పరశు రాములు, దారకొండ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.




## చిట్యాల బస్టాండ్‌ను ఆధునీకరిస్తాం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**చిట్యాల, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్‌ను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గ్రామ సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య ఆధ్వర్యంలో సంబంధిత అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్టాండ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడానికి అవసరమైన ప్రహరీ గోడ నిర్మాణం విద్యుత్ సౌకర్యం కల్పించడం కలరింగ్ పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం తదితర మౌలిక వసతుల పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆధునికరించాలని అధికారులకు సూచించారు. త్వరలోనే బస్టాండ్‌ను ప్రారంభించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ రీజినల్ మేనేజర్ ఎస్ భవానీ ప్రసాద్, సీఈ కవిత డిప్యూటీ రీజినల్ మేనేజర్ కిషన్ రావు భూపాలపల్లి డిపో మేనేజర్ మురళీకృష్ణ పరకాల డిపో మేనేజర్ టి శ్రీనివాసులు తాసిల్దార్ వసంతరావు ఎంపీవో శ్రీకాంత్ ఎంఆర్ఐ రాజేందర్ చిట్యాల అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ వార్డు సభ్యుడు తౌటం నవీన్ స్థానిక ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పల్లి గింజ, కందిపప్పుపై యోగాసనాలు

**కళాకారుడి అద్భుత సృష్టి**





**మట్టెవాడ, జూన్ 20 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరంలోని కాశిబుగ్గ వివేకానంద కాలనీ నివాసి మైక్రో ఆర్టిస్ట్ కుసుమ లింగమూర్తి జూన్ 21న ప్రపంచ యోగ దినోత్స వాన్ని పురస్కరించుకొని తనదైన శైలిలో కందిపప్పుపై, పల్లి గింజలపై యోగాసనాలు వేశారు. ఇప్పటివరకు చాలాసార్లు వివిధ ఆకృతులతో శనగపప్పుపై, బియ్యపు గింజలపై, ద్రాక్ష పళ్లపై, పెసరపప్పుపై కూడా అద్భుతమైనటువంటి కళాఖండాలను వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. లింగమూర్తి సామాజిక కార్యకర్తగా, అలయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్‌గా, ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ గా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ సమాజంలోని విభిన్న వర్గాల ప్రజలకు ఉపయోగపడేటువంటి మెసేజ్ ను పంపిస్తూ ఇలాంటి కళాఖండాలను తీర్చిదిద్దటంలో సిద్ధహస్తుడు. తన ప్రతిభకనుగుణంగా లింగమూర్తి గతంలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి అవార్డులు కూడా అందుకున్నారు.

## నీట్ పరీక్షా కేంద్రాన్ని ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**మట్టెవాడ, జూన్ 20 (పీపుల్స్ డైరీ):** జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణ సందర్భంగా వరంగల్‌లోని సీకేఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వై.వి.గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ, తహసిల్దార్ శ్రీకాంత్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మారెడ్డిలు ఉన్నారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 480 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారి కోసం 20 పరీక్షా గదులను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు 40 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అన్ని గదుల్లో జామర్లు ఏర్పాటు చేయడంతో పాటు, 35 సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. అభ్యర్థులకు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి ప్రవేశానికి అనుమతి కలదని, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్షా నిర్వహించడం జరుగుతుందని, దివ్యంగు లకు 6.16 వరకు పరీక్షా నిర్వహించడం జరుగుతోం దని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్ష సజావుగా నిర్వహించ బడేందుకు తీసుకున్న ఏర్పాట్లపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.

## విద్యార్థులు డిజిటల్ నైపుణ్యాలు నేర్చుకోవాలి



**కేసముద్రం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** మహబూబాబాద్ జిల్లా గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కృత్రిమ మేధస్సు డిజిటల్ లెర్నింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తృతీయ సంవత్సరం, ఐదవ సెమిస్టర్ విద్యార్థులకు కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించారు. కేసముద్రం పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఆర్. వెంకటేశ్వర్లు మాస్టర్ ట్రైనర్‌గా హాజరై కృత్రిమ మేధస్సు వినియోగం, డిజిటల్ నైపుణ్యాల ప్రాధాన్యంపై విద్యార్థులకు సూచనలు అందించారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు డిజిటల్ నైపుణ్యాలు నేర్చుకోవడం తప్పనిసరి అని తెలిపారు.కార్యక్రమంలో గార్ల, కేసముద్రం కళాశాలల నోడల్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకున్నారు.

## సీఎం, మంత్రి చిత్రపటాలకు చేనేత కార్మికుల క్షీరాభిషేకం

**కొండా సురేఖ చొరవతో చేనేత కార్మికుల కూలీలను 30 శాతం పెంచుతూ ఉత్తర్వులు**



**మట్టెవాడ, జూన్ 20 (పీపుల్స్ డైరీ):** చేనేత కార్మికుల కూలీల సమస్యల సాధన కోసం మంత్రి కొండా సురేఖ చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రి సురేఖ ఇచ్చిన విజ్ఞప్తిని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి ఈ దిశగా చర్యలు చేపట్టారు. మంత్రి సురేఖ చేనేత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు టెస్కో ద్వారా చేనేత కార్మికుల నేత కూలీలను 30% పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గోపాలస్వామి గుడి జంక్షన్‌లోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్రపటానికి చేనేత కార్మికులు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. దీంతో చేనేత సహకార సంఘాల్లో నిల్వ ఉన్న కార్పెట్లు, బెడ్‌షీట్ల కొనుగోళ్లకు చర్యలు చేపట్టడం జరిగింది. అదనంగా..2 లక్షల కార్పెట్లకు, 2 లక్షల బెడ్‌షీట్లకు కొత్త ఇండెంట్‌లు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత నాయకత్వం వహించారు. ఈ కార్యక్రమంలో దాసరి రాజశేఖర్, సామల శంకర్, పోరండ్ల సుదర్శన్, ముదిగొండ నాగరాజు, ఆడెపు నాగభూషణం, ఎండీ.అంకూస్, దాసరి సాంబయ్య, కొంగ రవి, ఆడెపు మార్కండేయ, దేవులపల్లి సమ్మయ్య, అడిగొప్పుల సంపత్, దువ్వల రాజేందర్, యెలుగం సాంబయ్య, పిట్ట రాములు, ఆడెపు రవి, పెండెం రాజేశ్వరి తదితర సంఘాల నాయకులు ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ఎడల వాహనాలు సీజ్

**ఎస్సై తాజొద్దీన్**

**గోవిందరావుపేట, జూన్ 20(పీపుల్స్ డైరీ) :** వాహనదారులునిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేయనున్నట్లు పసర ఎస్సై తాజొద్దీన్ సూచించారు,డ్రైవర్లు తప్పనిసరిగా రవాణా నిబంధనలు పాటించాలని శనివారం ఎస్సై ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ట్రాక్టర్. కార్. ఆటో. ద్విచక్ర వాహనాల యజమానులకు 20 సార్లు అవకాశం కల్పించడంతో పాటు కౌన్సిలింగ్ కూడా నిర్వహించినప్పటికీ కొందరిలో మార్పు కనిపించడం లేదని ఆయన తెలిపారు. వాహనాల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, పొల్యూషన్ సర్టిఫికేట్, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు. అలాగే వాహనం వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. రేపటి నుంచి సరైన పత్రాలు లేని ట్రాక్టర్లు, వెనుక రేడియం స్టిక్కర్లు లేని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాటిని సీజ్ చేస్తామని ఎస్సై తాజుద్దీన్ హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ రవాణా నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

**కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట రెండో రోజు నిరసన**

**నల్ల బ్యాడ్జీలతో ఆందోళన చేపట్టిన విద్యుత్ ఉద్యోగులు**

**రూ.255 కోట్ల టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్**

**గణపురం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** వైటీపీఎస్‌లో బొగ్గు, బూడిద నిర్వహణ విభాగాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన శనివారం రెండో రోజుకు చేరుకుంది. కేటీపీపీ టీజీపీఈ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు మాట్లాడుతూ... రూ.255 కోట్ల వ్యయంతో మూడు సంవత్సరాల పాటు ఈ విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించే టెండర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ వల్ల సంస్థ పనితీరు దెబ్బతినడంతో పాటు ఉద్యోగుల భద్రత, భవిష్యత్ అవకాశాలు ప్రమాదంలో పడతాయని పేర్కొన్నారు. వైటీపీఎస్‌లో ప్రారంభమైన ఈ ప్రక్రియ భవిష్యత్‌లో విద్యుత్ ఉత్పత్తి సంస్థలోని ఇతర విభాగాలకూ విస్తరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు చేపట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. టెండర్ ప్రక్రియను రద్దు చేసి సంబంధిత విభాగాలను సంస్థ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో టీజీపీఈ జేఏసీ నాయకులు, ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## శాలినీనగర్‌లో కుక్కల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

**బాలికను పరామర్శించి మెరుగైన వైద్యం, ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించాలి : చిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట**



**మట్టెవాడ, జూన్ 20 (పీపుల్స్ డైరీ):** వరంగల్ నగరంలోని లేబర్ కాలనీ శాలినీనగర్‌లో వీధి కుక్కల దాడిలో ఏడాదిన్నర బాలిక తీవ్రంగా గాయపడటం పట్ల బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి చేరుకొని చికిత్స పొందు తున్న బాలుడిని పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు రీతు, అజయ్ దంపతులు బతుకుదెరువు కోసం ఇటీవల వరంగల్ నగరానికి వలస వచ్చారన్నారు. భవన నిర్మాణ పనుల్లో భాగంగా శాలినీనగర్‌లో తల్లిదండ్రులు పని చేసుకుంటుండగా, ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ దాడిలో బాలిక ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బాలిక పరిస్థితిని పరిశీలించిన అనంతరం రవికుమార్ ఎంజీఎం ఇన్చార్జ్ సూపరింటెండెంట్, సంబంధిత ఈఎన్.టి వైద్యులతో మాట్లాడారు. బాలికకు ఎటువంటి లోటు లేకుండా తక్షణమే అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందించాలని, త్వరగా కోలుకునేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని కోరారు. నగరంలో వీధి కుక్కల అదుపుపై మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గంట రవి ధ్వజమెత్తారు. మున్సిపల్ అధికారులు మొద్దునిద్ర వీడి నగరవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కోతులు, కుక్కల దాడుల నుండి చిన్నారులను, నగర ప్రజలను కాపాడాలని గంట రవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పోలేపాక మార్టిన్ లూథర్, బిజెపి జిల్లా నాయకులు నోముల రతన్, బొడ్డు రాకేష్, రాఘవ చారి, రానా యాదవ్, శాలినీ నగర్ స్థానికులు పాల్గొన్నారు.

## అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి : డీఆర్వో



**ఖమ్మం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కలెక్టరేట్‌లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.రాంమూర్తి శనివారం తెలిపారు. జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా పని చేస్తుందని అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు, తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1077 లేదా మొబైల్ నంబర్ 9063211298 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. అలాగే వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్, ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు వెంటనే సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బాధిత కుటుంబాలకు 'పీఎస్ఆర్' భరోసా



**ఖమ్మం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గత నెల మరణించిన వ్యక్తుల కుటుంబాలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ కొండంత అండగా నిలిచింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు శనివారం బాధిత కుటుంబాలను నేరుగా కలిసి ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 44 కుటుంబాలకు ఒక్కో ఇంటికి 10,000 చొప్పున నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిశోర్, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్, గోనె భుజంగ రెడ్డి, వెంపటి రవి, వీరా రెడ్డి, మహేష్, భద్రకాళి, నూకల రామ్ మోహన్ రెడ్డి, రంజిత్ నాయక్, వెంకట నారాయణ, సాయి, కార్యకర్తలు, పొంగులేటి అభిమానులు పాల్గొని విజయవంతం చేశారు.

## స్మార్ట్ కిడ్జ్‌లో నేత్రపర్వంగా యోగా దినోత్సవం



**ఖమ్మం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** స్థానిక స్మార్ట్ కిడ్జ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ముందస్తు సంబరాలను శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం లను నిర్వహించి హుషారుగా గడిపారు. విద్యార్థులు పలు రకాల యోగాసన భంగిమలను వేసి, 12 రకాల సూర్య నమస్కారాలను ప్రదర్శించారు. యోగా గురువు సూచనల మేరకు ధ్యానం ను నిష్టగా నిర్వహించారు. వివిధ రకాల యోగాసన భంగిమలతో పాఠశాల మైదానం కనువిందు చేసింది. ఈ సందర్భంగా యోగాసనాలలో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... ప్రపంచానికి మన భారతదేశం ఇచ్చిన గొప్పకానుక యోగ అని తెలిపారు. యోగాసనాలు ప్రతి ఒక్కరిని నిత్యం ఉత్తేజకరంగా ఉంచుతుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో ఫాదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరికి తండ్రి గొప్ప హీరో అని పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

## స్మారక స్తూపాలపై ప్రజా ప్రతిఘటన జెండా పెట్టడాన్ని ఖండిస్తున్నాం



**గోవిందరావుపేట, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** సామా అంతిరెడ్డి పూలక్కల స్మారక స్తూపాలపై ప్రజా ప్రతిఘటన జండాలను నిలబడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ అన్న అన్నారు. శనివారం మండలంలోని లక్నవరం పంచాయతీ దుంపలగూడెం గ్రామంలో అమరులు అంతిరెడ్డి పూలక్కల స్మారక స్తూపాలను ప్రసాద్ బృందం పరిశీలించి మాట్లాడారు. సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకత్వంలో పార్టీ శ్రేణులు, ప్రజలు నిర్మించుకున్న అమరులు సామ అంతిరెడ్డి (సత్తన్న), పూలక్క స్మారక స్థూపాలపై ఉన్న సిపిఐ ఎంఎల్ జెండాను తొలగించి, ప్రజా ప్రతిఘటన జెండా ఎగురవేసే నైతిక హక్కు ఆ ముఠా నాయకుడిగా చెప్పుకుంటున్న సామ మోహన్ రెడ్డికి లేదని, ఇది వారి దివాలా కోరు పద్ధతిని తెలియజేస్తున్నదని, ఇలాంటి పద్ధతులను మానుకోవాలని సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం (ఏఐకేఎంకెఎస్) రాష్ట్ర కార్యదర్శి కెమిడి ఉప్పలయ్య, ములుగు జిల్లా కార్యదర్శి పల్లెబోయిన స్వామి, లతక్క, నరసింహ, నాంపల్లి స్వామి, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన అధ్యక్షులు



**చిట్యాల, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు సాదా సదానందం శైలజ పుత్రికైన రష్మిక వివాహము అఖిల్ వివాహ కార్యక్రమానికి బీజేపీ మండల అధ్యక్షుడు చిట్యాల ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ టేకుమట్ల బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్ నాయకులతో కలిసి శనివారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన ముసాపూరి మమత రాంకిషన్ దంపతుల కూతురు శ్రీహర్షిని నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్ రాయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గణపురాన్ని గడగడలాడిస్తున్న కోతులు!

**చాటింపులకే పరిమితమైన కోతుల నియంత్రణ!**

**ఇద్దరిపై దాడి జరిగి రెండు రోజులు.. చర్యలు మాత్రం శూన్యం**

**'మాటలు కాదు.. కోతులను పట్టండి' అంటూ మండల వాసుల ఆగ్రహం**



**గణపురం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండల కేంద్రంలో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతున్నా, వాటి నియంత్రణకు అధికారులు చేపడుతున్న చర్యలు కేవలం చాటింపులకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం కోతుల దాడిలో ఇద్దరు గాయపడిన ఘటన మండల కేంద్రంలో ఆందోళన కలిగించినా, సమస్య పరిష్కారానికి మాత్రం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించడం లేదు. కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తామని గ్రామంలో చాటింపు వేయించిన గ్రామం పాలకులు, అధికారులు, ఆ తర్వాత మాత్రం ఆ విషయాన్ని పట్టించుకోలేదని ప్రజలు మండిపడుతున్నారు. చాటింపు ముగిసింది.. కానీ కోతుల బెడద మాత్రం అలాగే కొనసాగుతోందని మండల ప్రజలు అంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గుంపులుగా సంచరిస్తున్న కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్లడం, మహిళలు, చిన్నారులను భయపెట్టడం, వృద్ధులపై దాడులకు తెగబడడం నిత్యకృత్యంగా మారింది. ఇటీవల జరిగిన దాడుల తర్వాత ప్రజల్లో మరింత భయం నెలకొన్నప్పటికీ అధికార యంత్రాంగం స్పందన మాత్రం కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "దాడులు జరిగిన తర్వాత కూడా చర్యలు లేకపోతే ఇంకెప్పుడు తీసుకుంటారు? మరింత పెద్ద ప్రమాదం జరిగాకా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోతుల నియంత్రణపై ప్రకటించిన కమిటీలను వెంటనే కార్యాచరణలోకి దింపి, వానరాలను పట్టుకుని తరలించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. "కోతులు స్వైరవిహారం.. అధికారులు వీక్షకుల పాత్ర!" అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## ఏఐఎస్‌బి 76వ వార్షికోత్సవాలను జయప్రదం చేయండి!

### ఏఐఎస్‌బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్



**మట్టెవాడ, జూన్ 20 (పీపుల్స్ డైరీ):** అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏ.ఐ.ఎస్.బి 76వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఏ.ఐ.ఎస్.బి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్ సెంటర్లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ హాజరై మాట్లాడుతూ ఆల్ ఇండియా విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్.బి) నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి అనుబంధంగా 1951 జూన్ 25న పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో ఏర్పడింది. నాటి నుండి నేటి వరకు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకై కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సోషలిజం సాధనకై విద్యార్థి, యువతలో జాతీయ భావాలను పెంపొందించడానికి, నేతాజీ కలలు కన్న భారత దేశ పునర్నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా గత 75 సంవత్సరాలుగా ఏ.ఐ.ఎస్.బి ఉద్యమిస్తోందని హకీమ్ నవీద్ వివరించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని మాయమాటలు చెప్పి అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవలసిన బాధ్యతను మరిచిపోయి సంఖ్య లేదని సాకుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడానికి సిద్ధమైందని హకీమ్ ఆరోపించారు. నెల 25 నుండి జూలై 25 వరకు జరిగే ఏ.ఐ.ఎస్.బి 76వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని హకీమ్ నవీద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి నాయకులు రోహిత్, రాజు, సతీష్ శ్రవణ్ కుమార్, మదన్, మిస్బా, సాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## మొట్లపల్లి పాఠశాలలో ఉత్సాహంగా ఆసనాలు వేసిన విద్యార్థులు



**మొగుళ్లపల్లి, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని మొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో యోగా దినోత్సవ ముందస్తు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉత్సాహంగా యోగాభ్యాసంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో విద్యార్థులు బాలాసనం (శశాంకాసనం) వంటి వివిధ యోగాసనాలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్న సరిత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో మేలు చేస్తుందని వివరించారు. ప్రతిరోజూ దినచర్యలో యోగాను భాగం చేసుకోవడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి చదువులో మరింతగా రాణించవచ్చని ఆమె సూచించారు. చిన్న వయసు నుంచే యోగా సాధన చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మహేష్, సురేందర్, శ్రీధర్, సునీత, రమేష్, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## ప్రమాద ఘటనలో డ్రైవర్‌కు ప్రాణదాతగా ఎమ్మెల్యే పాయం



**పినపాక, జూన్ 20(పీపుల్స్ డైరీ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం మండలం, మొండికుంట పాలవాగు వద్ద జరిగిన ఇసుక లారీ ప్రమాదంలో క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర అవస్థలు పడుతున్న డ్రైవర్‌ను రక్షించేందుకు శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమయస్ఫూర్తితో స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.అటుగా ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే పాయం ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపి పరిస్థితిని పరిశీలించారు. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ చిక్కుకు పోయి బయట కు రాలేని పరిస్థితిలో ఉండ టాన్ని గుర్తించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెంటనే ఐటీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక రెస్క్యూ బృందాన్ని ఘటనాస్థలికి పంపించాలని ఆదేశించారు. ఐటీసీ రెస్క్యూ బృందం అత్యవసర పరికరాలతో వేగంగా ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసేందుకు చర్యలు చేపట్టడంతో పాటు బాధితుడికి తక్షణ వైద్య సహాయం అందేలా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమయస్ఫూర్తిని అభినందించారు. ప్రమాద సమయంలో వెంటనే స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే సేవాతత్వాన్ని కొనియాడారు.

## అభయాంజనేయ ఆలయానికి దర్వాజా పూజ

**గణపురం, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని అప్పయ్యపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణంలో భాగంగా శనివారం ఆలయ ధర్వజ పూజ నిర్వహించారు. ఈ సంద ర్భంగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.





## కోతులను పట్టేందుకు నిపుణుల బృందం

**గణపురం, జున్ 20 (పీపుల్స్ డైరీ) :** గణపురం మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బపల్లి, కుందయ్యపల్లి గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టింది. శనివారం సర్పంచ్ కావటి రజిత రవీందర్ ఆధ్వర్యంలో కోతులను పట్టే నిపుణులను గ్రామానికి పిలిపించి గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన ఈ చర్యలను స్థానికులు అభినందించారు.




## బ్యాక్‌లాక్ ఉద్యోగాల భర్తీని మరిచిన ప్రభుత్వం

**చిట్యాల, జూన్ 20(పీపుల్స్ డైరీ) :** తెలంగాణలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో గత 12 సంవత్సరాల నుండి అన్ని జిల్లాల వారీగా భర్తీకి నోచుకోక మిగిలిపోయిన ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలకు ప్రభుత్వం స్పందించి తక్షణమే ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాట్లాడుతూ బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీని గత ప్రస్తుత ప్రభుత్వాలు ప్రభుత్వాలు మరిచాయని వాటికోసం ఎస్సీ ఎస్టీలు గత కొన్ని ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని వాటిని ఎందుకు భర్తీ చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఎస్సీ ఎస్టీలు ప్రభుత్వ ఉద్యోగాల కోసం లక్షలాది మంది ఎదురు చూస్తున్నారని బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీతో వారి జీవితాల్లో కొంత ఆర్థికంగా మెరుగు పడుతుందన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం జిల్లాల వారీగా ఖాళీలు పరిశీలించి ఎస్సీ ఎస్టీలతో ఈ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు.

## ఈ-కేవైసీ పేరుతో దోపిడీని అరికట్టండి..!

**సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి**



**మణుగూరు, జూన్ 20 (పీపుల్స్ డైరీ) :** పినపాక నియోజకవర్గంలోని హెచ్‌పీ, భారత్ గ్యాస్, అలాగే జిసిసి ఆధ్వర్యంలో నడిచే ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలలో నిర్వాహకులు డోర్ డెలివరీ పేరుతో వినియోగదారుల నుండి ముక్క పిండి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, అలాగే అశ్వాపురం మండలం లోని అభిరామ్ గ్యాస్ ఏజెన్సీలో జు-ఖజ పేరుతో వినియోగదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరో పణలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది, కర్నె రవి డిమాండ్ చేశారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశిత ధరలకు గ్యాస్ కొనుగోలు చేస్తున్న వినియోగదా రులకు డెలివరీ పేరుతో ఒక్కో గ్యాస్ పై రూ. 50 నుండి 100 రూపాయలు అదన పు డబ్బులను వసూలు చేయడం, అభిరామ్ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన E>KYC ప్రక్రియ నిర్వహించేందుకు వినియోగదారుల నుంచి 200 రూపాయలు అదనపు చార్జీలు వసూ లు చేయడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లై డిటి తక్షణమే స్పందించి గ్యాస్ ఏజెన్సీలలో తనిఖీలు నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో గ్యాస్ ధరలను ఉంచాలన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com